

అర్ధరాత్రి కరకట్టపై లారీల బారులు

ప్రశాంత ఎన్నికలు సాధ్యమేనా?



ధ్వసమైన టీడీపీ ఎంపీ అభ్యర్థి ప్రచార రథం

- దాడులతో రెచ్చిపోతున్న వైసీపీ శ్రేణులు
- చోద్యం చూస్తున్న పోలీసు శాఖ
- ఎస్పీని బదిలీ చేసినా తీరు మార్చుకోని అధికారులు
- కోడ్ ఉన్నా తగ్గేదేలే అన్నట్లుగా అరాచకాలు
- ఐదు రోజుల్లో నాలుగు ఘటనలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎన్నికల షెడ్యూల్ వచ్చింది.. ఇక నోటిఫికేషనే తరువాయి. ఈ పరిస్థితుల్లో ఒకవైపు దాడులు.. దౌర్జన్యాలు.. దహనాలతో అధికార పార్టీ శ్రేణులు చెలరేగిపోతున్నారు. మరోవైపు కోడ్ వచ్చి రోజులు గడుస్తున్నా పట్టించుకోని పోలీసులు.. ఈ పరిస్థితుల్లో పల్నాడు జిల్లాలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేనా అన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. గత ఐదు రోజుల్లో నాలుగు సంఘటనలు చోటుచేసుకోగా పోలీసులు ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు. పోలీసులు చర్యలు లేకపోవడంతో అధికార పార్టీ శ్రేణులు పట్టపగ్గాలు లేకుండా చెలరేగిపోతున్నాయి. అటు రాష్ట్రంలో ఆరాచక పాలన.. ఇటు జిల్లాలో అధికార పార్టీ వ్యవహరిస్తున్న తీరు.. తాజా ఘటనలతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. పోలింగ్ కేంద్రాల్లో ఎక్కువగానే సమస్యాత్మకమైనవిగా ఇప్పటికే గుర్తించారు. ఈ నేపథ్యంలో మే 13న జరగనున్న పోలింగ్ శాంతియుత వాతావరణంలో నిర్వహించడం జిల్లా యంత్రాంగానికి కత్తి మీద సాములాగే కనిపిస్తోంది. కోడ్ అమలులో ఉన్నా అధికార పార్టీ శ్రేణులు తగ్గేదేలే అన్న రీతిలో అరాచకాలకు పాల్పడుతూనే ఉంది. తమ మాట వినని వారిపై దాడులకు తెగబడుతున్నాయి. వీటికి హద్దే లేకుండా పోయింది. వరుసగా జరుగుతున్న అరాచక సంఘటనలతో యంత్రాంగానికి ఎన్నికల నిర్వహణ సవాల్‌గా మారుతోంది. మాచర్ల నియోజకవర్గంలో ఆటవిక రాజ్యం రాజ్యమేలుతుంది. పోలీసుల అండదండలతోనే అనేక విధ్వంసాలు.. దాడులు.. హత్యలు జరిగాయన్న విమర్శలున్నాయి. ఎన్నికల కమిషన్ ఎస్పీ రవిశంకర్‌రెడ్డిపై ఇటీవల వేటు వేసినా పోలీసుల పనితీరులో మార్పురాలేదన్న ఆరోపణలున్నాయి. కోడ్ అమలులో ఉన్నా పోలీసు అధికారులు జరుగుతున్న అరాచకాలపై సరైన రీతిలో స్పందించడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అరాచకాలతో ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసి వారు ఓటు హక్కు వినియోగించుకోకుండా అధికార పార్టీ పథకాన్ని అమలు చేయబోతోందన్న ప్రచారం జరుగుతోంది. దీనికి కౌంటర్ ఇచ్చే రీతిలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహిస్తామన్న భరోసా ఓటర్లల్లో కల్పించేందుకు పోలీసులు, ఎన్నికల అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాలి. ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని బదిలీ చేయడంతో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతాయని ఓటర్లు భావించారు. అయితే కొందరు పోలీసు అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో ఓటర్లలో ప్రశాంత ఎన్నికలపై నమ్మకం సన్నగిల్లుతోంది. ఎస్పీగా బాధ్యలు చేపట్టిన బింధుమాధవ్‌కు జిల్లాలో ఎన్నికలు ఓ సవాల్‌గా మారాయి.

ఇటీవల జరిగిన అరాచకాలను చూస్తే..

● సిద్ధం సభకు రాలేదని దాడి..

పిడుగురాళ్ల వద్ద వైసీపీ సిద్ధం సభకు రానన్నందుకు బుధవారం మాచర్ల నియోజకవర్గం అచ్చమ్మకుంట గ్రామంలో ఎస్టీ వర్గానికి చెందిన బాణావత్ చత్రియానాయక్‌పై వైసీపీ కార్యకర్తలు కర్రలతో దాడి చేసి తలపగలగొట్టారు. సిద్ధం సభకు రాకుంటే చంపేస్తాం.. వస్తావా.. చస్తావా తేల్చుకోవాలని బెదిరించారు. సభకు రాననడంతో కర్రలతో నాయక్‌పై కిరాతకంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.

● జగన్‌కు ఓటు వేయకుంటే చంపేస్తా..

కారంపూడి మండలం పెదకొదమగుండ్లలోని ఓ కాలనీవాసులపై వలంటీరు వంగల సాగర్ దాడి చేశారు. జగన్‌కు ఓటు వేయకపోతే చంపేస్తానంటూ వలంటీరు బెదిరింపులకు దిగాడు. అడ్డొచ్చిన వారిపై దాడి చేశాడు. అదేమని ప్రశ్నించిన కడియం నాగరాజు అనే యువకుడిపై గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అంతటితో ఆగక తాగునీటి పైపులైన్‌ను కూడా ధ్వంసం చేశాడు. టీడీపీ కార్యకర్తలను దుర్భాషలాడుతూ గ్రామంలో బీభత్సం సృష్టించిన ఈ సంఘటన శనివారం జరిగింది.

● టీడీపీ కార్యాలయం దహనం

క్రోసూరులో ఇటీవల నిర్వహించిన చంద్రబాబు ప్రజాగళం సభ ఘన విజయం సాధించింది. దీనిని జీర్ణించుకోలేని వైసీపీ కార్యకర్తలు సోమవారం రాత్రి గ్రామంలోని టీడీపీ కార్యాలయాన్ని దహనం చేశారు.

● టీడీపీ ప్రచార రథం ధ్వంసం

రెంటచింతల మండలం మంచికల్లులో టీడీపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలుకు సంబంధించిన ప్రచార రథాన్ని ధ్వంసం చేసి డ్రైవర్‌పై వైసీపీ మూకలు దాడికి పాల్పడ్డారు. గ్రామంలో టీడీపీ ప్రచార రథం రావడంతో మంగళవారం అక్కసు వెళ్లగక్కారు. ఇది మా అడ్డా.. ఎవడు పంపించాడ్రా.. అంటూ రోడ్డు పక్కన నిలిపి ఉంచిన వాహనంపై కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఎల్ఈడీ స్ర్కీన్, డ్రైవర్ సెల్‌ఫోన్ పగలగొట్టారు. డ్రైవర్‌తో పాటు అతడి సహాయకులను గాయపరిచారు.



దాడిలో గాయపడిన కడియం నాగరాజు



గాయపడిన బాణావత్ చత్రియానాయక్



క్రోసూరులో దహనమవుతున్న టీడీపీ కార్యాలయం (ఫైల్)

కృష్ణానదిలో.. ఇసుక దొంగలు

కృష్ణానదిలో ఇసుక దొంగలు. అర్ధరాత్రి యథేచ్ఛగా ఇసుకను తోడేస్తున్నారు. కృష్ణమ్మను కుళ్లబొడుస్తున్నా పోలీసు, ఎస్ఈబీ అధికారులకు పట్టడంలేదు. అధికారానికి అధికారులు దాసోహయ్యారా.. లేదంటే అనధికారిక వసూళ్లలో నిమగ్నమయ్యారో తెలియడంలేదు కానీ గత కొద్ది రోజులుగా చీకటి పడగానే ఇసుక దొంగలు చెలరేగిపోతున్నారు. బొమ్మువానిపాలెం దగ్గర కరకట్టపై లారీలకు లారీలు బారులు తీరి భారీ యంత్రాలతో ఇసుక దొంగలు ఇసుక తవ్వుకుపోతున్నారు. ఏ అనుమతులూ లేని రీచ్‌లో ఇసుకను తోడేస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. ఎన్నికల కోడ్‌లో ఏ నేతకూ తలొగ్గాల్సిన అవసరం లేదు. అధికార ఇసుక దందాను అధికారులు కట్టడి చేస్తారని ప్రజలు భావించారు. అయితే అందుకు విరుద్ధంగా ఇక్కడి పరిస్థితి నెలకొంది.

- అర్ధరాత్రి అనుమతుల్లేని రీచ్‌లో తవ్వకాలు
- ఎన్నికల కోడ్ సమయంలో అధికారిక దందా
- బొమ్మువానిపాలెం, అన్నవరం రీచ్‌లలో తవ్వకాలు
- వీడియోలు తీసి పంపినా పట్టించుకోని అధికారులు

తెనాలి/కొల్లిపర, ఏప్రిల్ 10: జాతీయ హరిత ట్రిబ్యునల్, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతి ఉన్న రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు పగలు మాత్రమే జరగాలి. రాత్రి సమయాల్లో ఇసుక తవ్వకాలు నిషేధం. అయితే ఏకంగా రాత్రి వేళ నిర్భయంగా వందల సంఖ్యలో లారీలకు ఇసుక నింపేసి పంపించేస్తున్నారు. బహిరంగంగానే ఈ దందా నడుస్తున్నా అధికారులు అడ్డుకున్న దాఖలాలే లేవు. కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం, అన్నవరం రీచ్‌లలో ఇసుక దోపిడీ జరుగుతుంది. ఇసుక దందాపై స్థానికులు పోలీసులకు ఎన్నిసార్లు సమాచారం ఇచ్చినా, వీడియోలు తీసి పంపినా ఫలితం లేదు. మీడియాను ఆశ్రయించగా బుధవారం ఆయా రీచ్‌లను పరిశీలిస్తే... ఎటు చూసినా బారులు తీరిన లారీలు, పరిమితికి మించిన లోడ్‌తో వెళుతున్న లారీలు కనిపించాయి. ఇటీవల దుగ్గిరాల మండలం పెదకొండూరు దగ్గర ఇసుక లారీలను పట్టుకుని స్థానికులు పోలీసులకు పట్టించారు. ఆ ఒక్కరోజు ఆపినా, ఆ తర్వాత మళ్లీ తవ్వకాలు, అక్రమ రవాణా యథావిధిగా జరిగిపోతోంది. ఇదే పరిస్థితి కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం, అన్నవరం రీచ్‌లలో కూడా నెలకొంది.

కోడ్ వచ్చినా అధికారిక దందా..

ఇంతకాలం ఎమ్మెల్యేనో, ఎంపీ, మంత్రి పేరుచెప్పి ఇసుక తవ్వుకుపోయారు. ఇప్పుడు అవేమీ కుదరవు. ఏది జరిగినా మా కన్నుసన్నల్లో జరగాల్సిందే. ఇదీ ఇటీవల ఇసుక లారీల యజమానులతో ఓ అధికారి చెప్పిన మాట. ఈ రెండు నెలలూ తాము చెప్పినట్లు వినాల్సిందేనంటూ హుకుం జారీచేసి మరీ ఇసుక తవ్వకాలకు పచ్చజెండా ఊపారు. అంటే ఇదంతా అధికారులకు తెలిసే జరుగుతున్నట్లు అర్థమవుతుంది. బొమ్మువానిపాలెం దగ్గర చీకటిపడితే చాలు.. కరకట్టపై, నదిలో వేసిన గాలు మార్గంలో వందల సంఖ్యలో లారీలు బారులుతీరి ఉంటున్నాయి. నదిలో భారీ ఎక్స్‌కవేటర్లతో ఇసుక తోడుస్తున్నారు. పరిమితికి మించిన లోడుతో ఇసుక లారీలు తరలిపోతున్నాయి. ప్రస్తుతం మున్నంగి రీచ్‌లో తవ్వకాలు ఆగాయి. వారంక్రితం అధికారికంగా రీచ్ తెరుస్తామని ప్రచారం చేసినా ప్రారంభం కాలేదు. పెదకొండూరు రీచ్‌లో తవ్వకాలకు స్థానికులు అడ్డుపడుతుండటంతో బొమ్మువానిపాలెం, అన్నవరం రీచ్‌లో అక్రమ తవ్వకాలకు డిమాండ్ పెరిగింది. దీంతో నిన్నటి వరకు పగలు తవ్వకాలు జరపగా ఇప్పుడు రాత్రివేళల్లో సాగిస్తున్నారు. బొమ్మువానిపాలెం, మనుమాన్ పాలెం వాసులు పోలీసులకు సమాచారం అందించినా అధికారులు పట్టించుకోలేదని వారు వాపోతున్నారు. ఫోన్‌చేసి ఫిర్యాదు చేసినప్పుడు వచ్చి కేకలు వేసి వెళ్లిపోవడం, గంట తర్వాత మళ్లీ తవ్వకాలు సాగడం పరిపాటిగా మారిందని వారు చెబుతున్నారు.

బోర్ల నుంచి నీరు రావటంలేదు

మొక్కజొన్న చేతికొచ్చి, నీటి తడులు పెట్టాల్సిన అవసరం లేకున్నా భూగర్భ జలాలు మరింత అడుగుకుపోయాయి. లంక గ్రామాల్లో వాణిజ్య పంటలకు ఎకరాకు నీటి తడిని అందించాలంటే మొన్నటి వరకు మూడు నుంచి వారం రోజులు పడితే, ఇప్పుడు ఆ మాత్రం కూడా నీరు అందడం లేదు. ఇసుక నిల్వలు ఉన్నా తవ్వుకున్నారంటే పట్టించుకునేవారిమి కాదని, ఇసుక తవ్వటానికి లేకపోయినా, నీరు బయటపడే వరకు పది నుంచి 20 అడుగుల లోతుపెట్టిమరీ తవ్వుకుపోతున్నారని వాపోతున్నారు. దీనివల్ల భూగర్భ జలాలు పూర్తిగా పడిపోయాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిన్నటి వరకు సాధారణ మోటార్లకు నీరు రాకపోతే సబ్‌మెర్సిబుల్, జెట్ మోటార్లు అమర్చామని, ఇప్పుడు వాటికి కూడా నీరు రాకుండా మట్టి, ఇసుక వస్తున్నాయంటున్నారు. ఎన్నికల కోడ్ వచ్చినా ఇసుక తవ్వకాలు ఆగలేదేంటనేది వారి ప్రశ్న. నిన్నటి వరకు నాయకులు తవ్వుకుపోతే, ఇప్పుడు అధికారులు తవ్వుకుపోతున్నారా! అంటూ వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక తవ్వనివ్వని వారికే ఈ సారి ఓటు వేద్దాం!

ఇసుక విచ్చలవిడి తవ్వకాలకు అనుమతివ్వని వారికే ఈ సారి ఓటు వేస్తామని కొల్లిపర మండలంలోని కొన్ని తీర గ్రామాల ప్రజలు తేల్చి చెప్పేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు కట్టుబడి ఉందామని తీర్మానించుకున్నట్లు సమాచారం. ప్రచారాలకు వచ్చే అభ్యర్థులకు కూడా ఇదే విషయాన్ని చెప్పాలని వారు నిర్ణయించుకున్నారు. ఈ సారి పార్టీల అభిమానంతో ఓటేస్తే కష్టమని, మన భవిష్యత్ కోసం కఠిన నిర్ణయం తీసుకోవాల్సిందేనని వారి ఆలోచన. ఇసుక దందాతో ఒక్కో ఊరికి ఒకరిద్దరు దోచుకుని లాభపడుతుంటే, మిగిలిన గ్రామాలన్నీ నాశనమవుతున్నాయంటున్నారు. పచ్చని పల్లెల్లో ఇసుక చిచ్చురేపుతోందని, ఇకపై ఇటువంటివి లేకుండా ఉండాలంటే ఇసుక తవ్వకాలు ఆపేవారు కావాలని బొమ్మువానిపాలెం, కొల్లిపర, వల్లభాపురం, అత్తలూరివారిపాలెం, అన్నవరం, అన్నవరపులంక, కొత్తూరులంక తదితర గ్రామాల ప్రజలు తీర్మానించారు. నది మధ్య ఉన్న లంక గ్రామాల ప్రజలు ఈ విషయంలో పట్టుదలగా ఉన్నారని సమాచారం.



కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం-చిలుమూరు మధ్య కరకట్టపై పరిమితికి మించిన లోడుతో అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలు

ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలి

● అధికారులను ఆదేశించిన కలెక్టర్ శివ శంకర్



పాలిటెక్నిక్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ శివశంకర్

క్రోసూరు, ఏప్రిల్ 10: ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. బుధవారం క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, ఎన్నికల నిర్వహణ, తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈవీఎం భద్రత ప్రాంతాలను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటు, అసెంబ్లీకి, పార్లమెంట్‌కు కేటాయించిన స్ట్రాంగ్ రూమ్‌ల సౌకర్యాలను నిశితంగా పరిశీలించారు. పీవోలకు, ఏపీవోలకు ఈనెల 15న జరిగే శిక్షణా కార్యక్రమంలో అధికారులు దిశ, నిర్దేశం చేయాలన్నారు. ఆయనతో పాటు పెదకూరపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, పులిచింతల ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ కందుల శ్రీరాములు, పెదకూరపాడు తహసీల్దార్ ప్రభాకర్, క్రోసూరు తహసీల్దార్ శ్రీనివాసరావు, క్రోసూరు ఎస్ఐ మహమ్మద్ షఫీ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

12న చంద్రబాబు ప్రజాగళం



వేమూరులో టీడీపీ, జనసేన శ్రేణులతో మాట్లాడుతున్న ఆనందబాబు

కొల్లూరు/రేపల్లె, ఏప్రిల్ 10: ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రజాగళం సభ 12వ తేదీ సాయంత్రం 6 గంటలకు పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద జరుతుందని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఉప్పూడి రోడ్డులోని హెలీప్యాడ్ పనులను బుధవారం ఆర్అండ్‌బీ అధికారులు ఎమ్మెల్యే సోదరుడు శివప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాగళం సభకు నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, ప్రజలు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

● వేమూరు: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు మండల కేంద్రమైన కొల్లూరులో శుక్రవారం ప్రజాగళం రోడ్డు షోను నిర్వహించనున్నట్లు మాజీమంత్రి, వేమూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు కోరారు. బుధవారం సాయంత్రం వేమూరులోని పార్టీ కార్యాలయంలో టీడీపీ, జనసేన శ్రేణుల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం 3గంటలకు కొల్లూరు గౌడపాలెం వద్ద ప్రజాగళం కార్యక్రమం జరుగుతుందన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, వేమూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పూడి రోడ్డులో చంద్రబాబు పర్యటనకు హెలీప్యాడ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సోదరుడు శివప్రసాద్, ఆర్అండ్‌బీ అధికారులు

ఈద్ ముబారక్

- నేడే ఈద్-ఉల్-ఫితర్ పర్వదినం
- 30 రోజుల ఉపవాస దీక్షల విరమణ
- ఫిత్రా రూ.100గా నిర్ణయం
- విద్యుత్ వెలుగుల్లో మసీదులు

నరసరావుపేట కల్చరల్, ఏప్రిల్, 10: గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బుధవారం సాయంత్రం ఆకాశంలో నెలవంక (చంద్రోదయం) దర్శనమిచ్చింది. దీంతో గురువారం రంజాన్ పర్వదినాన్ని జరుపుకోవచ్చని ముస్లిం మత పెద్దలు ప్రకటించారు. దీంతో ముస్లింలు 30 రోజులుగా చేసిన కఠిన ఉపవాస దీక్షలు వీడి పండుగ పనుల్లో బిజీ అయిపోయారు. రంజాన్ పర్వదినం సందర్భంగా మసీదులు, ఈద్గాలను అంగరంగ వైభవంగా ముస్తాబు చేశారు. ఈ ఏడాది రంజాన్ మాసంలో ఎన్నికల హడావుడి మొదలు కావడంతో రాజకీయ ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. నెలరోజుల పాటు సాగిన రంజాన్ ఉపవాస దీక్షలు, ఇఫ్తార్లలో పలువురు రాజకీయ నేతలు పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. వారికి పలు రకాలుగా సేవలు అందజేశారు.

పరోపకారానికి నిదర్శనంగా దాన, ధర్మాలు

ఈదుల్ ఫితర్ పండుగ అత్యున్నత మానవీయ విలువలను, పరస్పర ప్రేమానురాగాలను పెంపొందిస్తుందని ముస్లింలు బలంగా నమ్ముతారు. రంజాన్ నెలలో అత్యధిక దానధర్మాలు చేస్తారు. సంపాదనాపరులైనవారు, సంపన్నులైనవారు రంజాన్ నెలలో జకాత్ అచరించాలని ఖురాన్ బోధిస్తోంది. ఆస్తిలోనుంచి నిర్ణీత మొత్తాన్ని పేదలకు దానం చేయడాన్ని జకాత్ అని అంటారు.

రంజాన్ అంటే..

రమదాన్ అంటే శుభవేళ, ఉత్సవ సమయం అని అర్థం. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం. రమదాన్‌ను వాడుక భాషలో సాధారణ ప్రజలు రంజాన్‌గా పిలుస్తుంటారు. చంద్రమానాన్ని అనుసరించి రూపొందించిన ఇస్లామిక్ క్యాలండరులో తొమ్మిదో నెల 'రంజాన్'. ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ ఈ మాసంలోనే ఆవిర్భవించిందని ప్రవక్తలు చెప్పడంతో రంజాన్‌ను అత్యంత పవిత్రమైన నెలగా భావిస్తారు. ముప్పై ఉపవాస దీక్షలు పాటించి పదో నెల 'షవ్వాల్' మొదటి రోజున ఈదుల్ ఫిత్ర్ జరుపుకుంటారు. 'చంద్రోదయం(నెలవంక దర్శనం) జరిగితేనే ఈద్- ఉల్- ఫితర్ జరుపుకుంటారు. ఈద్- ఉల్- ఫితర్ నాడు ప్రత్యేకమైన సలాత్(ఇస్లామీయ ప్రార్థన) చేస్తారు. ఈ ప్రార్థనను సమూహంగానే (జమాత్) చేస్తారు. ఈద్గాల వద్ద అందరూ గుమిగూడి దైవానికి కృతజ్ఞతలు సమర్పించుకుంటూ నమాజ్ చేస్తారు.

మసీదులకు అలంకరణ...

రంజాన్ పండుగ సందర్భంగా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. విద్యుత్ వెలుగుల్లో మసీదులు శోభాయమానంగా కన్పిస్తున్నాయి. కొనుగోలుదార్లతో దుకాణాలు కిటకిటలాడాయి. నమాజ్ చేయడానికి వీలుగా ఆయా ప్రాంతాల్లో ఈద్గా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు పూర్తయ్యాయి. నమాజు చేసుకోవడానికి వీలుగా షామియానాలు వేశారు. వజూ చేసుకోవాడానికి వసతి ఏర్పాట్లు చేశారు. ఉదయం పదిగంటలకు ఈద్ నమాజ్ ప్రారంభమవుతుందని మైకుల ద్వారా చెప్పించారు.

పండుగ సందర్భంగా ప్రతి ముస్లిం విధిగా ఫిత్రాను ఇవ్వాలి. ఈ ఏడు ఫిత్రాను 100 రూపాయలుగా ప్రకటించారు. ఇంట్లో ఎంతమంది సభ్యులు ఉంటే అంతమంది ఫిత్రా విధిగా ఇవ్వాలి. రంజాన్ సందర్భంగా ప్రతి ఒక్క ముస్లిం జకాత్‌ను ఇవ్వాలి. జకాత్ అంటే తమ ఆదాయంలో పది శాతం ధనాన్ని తీసి, పేద ముస్లింలకు ఇవ్వాలి.



నరసరావుపేటలో విద్యుత్ వెలుగుల్లో కాంతులీనుతున్న నాయబ్ బజార్ మసీదు



శివానీగా తమన్నా

'అరణ్మనై' తమిళంలో సూపర్ హిట్ ఫ్రాంఛైజీ. తెలుగులో విడుదలైన అన్ని వర్షెన్లు హిట్ అయ్యాయి. ఈ హారర్ కామెడీ సిరీస్ నాలుగో ఫ్రాంఛైజీ తెలుగులో 'బాక్' పేరుతో వస్తోంది. స్వీయ నిర్మాణంలో సుందర్ సి నటస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో తమన్నా, రాశి ఖన్నా నటిస్తున్నారు. శివానీ పాత్రను పోషిస్తున్న తమన్నా లుక్ పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'బాక్' చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమా తెలుగు హక్కుల్ని సొంతం చేసుకున్న ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ నెలలోనే భారీగా విడుదల చేయడానికి ప్లాన్ చేస్తోంది. వెన్నెల కిశోర్, శ్రీనివాసులు, ఢిల్లీ గణేశ్, కోవై సరళ కీలక పాత్రలు పోషించారు.

ఎలాంటి సాయానికైనా సిద్ధం

- మల్లు భట్టి విక్రమార్క



నటి అంజలి నటించిన 50వ చిత్రం 'గీతాంజలి మళ్లీ వచ్చింది'. శివ తుర్లపాటి దర్శకత్వం వహించారు. రచయిత కోనవెంకట్, ఎంవీవీ సత్యనారాయణ సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. మంగళవారం సాయంత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ "మధ్య తరగతి వాళ్లని మరో ప్రపంచంలోకి తీసుకెళ్లేదే సినిమా. ప్రభుత్వపరంగా ఇండస్ట్రీకి ఎలాంటి సాయం కావాలన్నా చేసేందుకు సిద్ధం" అని చెప్పారు. దర్శకుడు శివ తుర్లపాటి మాట్లాడుతూ "ఈ మూవీలో ఇంటర్వెల్, క్లైమాక్స్‌ను అస్సలు మిస్ అవ్వద్దు" అని అన్నారు. నిర్మాత కోనవెంకట్ మాట్లాడుతూ "గీతాంజలి చిన్న కాన్సెప్ట్‌తో తీశాం. పెద్ద హిట్ అయ్యింది. సీక్వెల్ కూడా సూపర్ సక్సెస్ సాధిస్తుంది" అని ధీమా వ్యక్తం చేశారు. హీరోయిన్ అంజలి మాట్లాడుతూ "మొదటి భాగం కంటే రెండో భాగం మరింత ఎంటర్టైన్ చేస్తుంది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో రచయిత విజయేంద్రప్రసాద్, సిద్ధు జొన్నలగడ్డ, డైరెక్టర్స్ వశిష్ఠ, నందినిరెడ్డి, హేమంత్ మధుకర్, నిర్మాత టీజీ విశ్వప్రసాద్ పాల్గొన్నారు.

మే 4న ఘనంగా డైరెక్టర్ డే వేడుకలు



దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతి (మే 4)ని తెలుగు దర్శకుల సంఘం డైరెక్టర్స్ డే గా సెలబ్రేట్ చేస్తోంది. ఈ ఏడాది మరింత భారీగా ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ వివరాలను అసోసియేషన్ అధ్యక్షుడు వీరశంకర్ వెల్లడిస్తూ ' డైరెక్టర్స్ డే ను ఎల్బీ స్టేడియంలో భారీగా నిర్వహించడం ఇదే మొదటి సారి. ఈ ఈవెంట్ ద్వారా వసూలయ్యే మొత్తాన్ని అసోసియేషన్ సంక్షేమం కోసం వినియోగిస్తాం. ఈ ఈవెంట్ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన కమిటీలో అనిల్ రావిపూడి, శివ నిర్వాణ, నందిని రెడ్డి తదితరులు ఉంటారు. పరిశ్రమలోని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానిస్తున్నాం' అన్నారు. 'దర్శకుల సంఘానికి ఇదొక బెంచ్ మార్క్ ఈవెంట్ అవుతుందని నందినీ రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమం గురించి చెప్పగానే త్రివిక్రమ్, సుకుమార్ వంటి పెద్ద దర్శకులందరూ సపోర్ట్ చేయడానికి ముందుకు వచ్చారని సాయి రాజేశ్ చెప్పారు. గతంలో వజ్రోత్సవాలు ఏ స్థాయిలో జరిగాయో అంత ఘనంగా డైరెక్టర్స్ డే ను సెలబ్రేట్ చేస్తామని వశిష్ఠ చెప్పారు.

ఆధ్యాత్మికం.. సాహసోపేతం

అభిషేక్ పిక్చర్స్ అధినేత అభిషేక్ నామా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'నాగబంధం'. ది సీక్రెట్ ట్రెజర్.. అనేది ట్యాగ్‌లైన్. ఆధ్యాత్మిక, సాహసోపేతమైన అంశాలు కలిగిన ఓ పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు అభిషేక్ నామా. కేజీఎఫ్‌లో నటించిన అవినాష్‌ను అఘోరా పాత్రలో పరిచయం చేస్తూ ఓ వీడియో విడుదల చేశారు. హై బడ్జెట్‌తో, అద్భుతమైన



విజువల్స్‌తో సాహసాల ప్రపంచంలోకి ఈ సినిమా తీసుకెళుతుందని నిర్మాత మధుసూదన్‌రావు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: అభే. ఫొటోగ్రఫీ: సౌందర్‌రాజన్ ఎస్, సమర్పణ: దేవాన్ష్ నామా.

మళ్లీ అదే రోజున..



నిజాయితీ కలిగిన న్యూస్ రిపోర్టర్‌గా నారా రోహిత్ నటించిన 'ప్రతినిధి 2' చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. సరిగ్గా పదేళ్ల క్రితం 'ప్రతినిధి' చిత్రం కూడా ఏప్రిల్ 25నే విడుదల కావడం విశేషం. నారా రోహిత్ తన ఇంటెన్స్ యాక్టింగ్‌తో ఆకట్టుకుంటారని దర్శకుడు మూర్తి చెప్పారు. సిరీ లెల్లా హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని కుమార్ రజాబత్తుల, ఆంజనేయులు శ్రీ తోట, సురేంద్రనాథ్ బొల్లినేని నిర్మించారు.



భారీ మొత్తం చెల్లించి...

జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. మిక్కిలినేని సుధాకర్, కె హరికృష్ణ నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ చిత్రం ఫస్ట్ పార్ట్ అక్టోబర్ 10న విడుదలవుతోంది. ఈ సినిమా ఉత్తరాది థియేట్రికల్ రైట్స్‌ను ధర్మ ప్రొడక్షన్స్ అధినేత కరణ్ జోహార్, ఏఏ ఫిల్మ్స్ ఫౌండర్ అనిల్ తడాని భారీ మొత్తం చెల్లించి సొంతం చేసుకున్నారు.
ఈ క్రేజీ డీల్‌తో నార్త్‌లోనూ 'దేవర' చిత్రం కలెక్షన్ల సునామీ సృష్టిస్తుందని చిత్ర బృందం, అభిమానులు ఆశిస్తున్నారు.

నేడు వేల్పూరుకు నారా భువనేశ్వరి..

వేల్పూరు (శావల్యాపురం) ఏప్రిల్10: 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి గురువారం సాయంత్రం 8గంటలకు శావల్యాపురం మండలంలోని వేల్పూరు గ్రామానికి విచ్చేయుచున్నట్లు పల్నాడుజిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో మరణించిన వేల్పూరు గ్రామానికి చెందిన తెలుగు యువత సభ్యుడు బోయపాటి మణికంఠ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు భువనేశ్వరి వేల్పూరుకు రానున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కొలకలూరుకు నారా భువనేశ్వరి ..

నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా నారా భువనేశ్వరి గురువారం కొలకలూరు రానున్నారు. అక్రమ కేసులతో చంద్రబాబును జైలుకు పంపడాన్ని తట్టుకోలేక మనోవేదనతో మృతి చెందిన కొలకలూరు గ్రామానికి చెందిన టీడీపీ వీరాభిమాని దాచేపల్లి శివరామయ్య కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించనున్నారు. సాయంత్రం 5.30 గంటలకు భువనేశ్వరి కొలకలూరు చేరుకోనున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఘన స్వాగతం పలికేందుకు టీడీపీ నేతలతోపాటు కూటమి శ్రేణులు సన్నద్ధం అవుతున్నారు..



హెలిప్యాడ్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న నక్కా ఆనందబాబు, డీఎస్పీ మురళీకృష్ణ

రాక్షస పాలనకు త్వరలో అంతం

- వేమూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు

కొల్లూరు, ఏప్రిల్ 10: రాష్ట్రంలో రాక్షస పరిపాలన అంతమొందించేందుకు ప్రజలంతా వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారని మాజీ మంత్రి, వేమూరు నియోజకవర్గ అభ్యర్థి నక్కా ఆనందబాబు అన్నారు. ఈ నెల 12వ తేదీన కొల్లూరులో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఇందుకోసం అనువైన ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో ఆనందబాబు మాట్లాడుతూ వైసీపీకి అభ్యర్థులు దొరకడం లేదన్నారు. వారానికి ఒక అభ్యర్థి మారిపోతున్నారని, ఆపార్టీకి అభ్యర్థులు కరువై ఒకే ఇంటిలో ఇద్దరు ముగ్గురు అభ్యర్థులు నిలబెట్టాల్సిన పరిస్థితి ఆ పార్టీకి దాపురించిందన్నారు. టీడీపీ కూటమికి మాత్రం అభ్యర్థులు ఎక్కువై సర్దుకోవాల్సిన పరిస్థితి చూస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో మద్యం పంపిణీ చేసేందుకు అధికార పార్టీ మద్యం భారీగా నిల్వ చేసిందని, ఎన్నికల సంఘం నిల్వలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకోవాలని అధికార పార్టీ నాయకులు చేస్తున్న దుర్మార్గాలపై ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించి వాటిని అరికట్టాలని కోరారు. శుక్రవారం మధ్యాహ్నం కొల్లూరులో 3 గంటలకు పార్టీ అధినేత చంద్రబాబు బహిరంగ సభకు వేమూరు నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో నియోజకవర్గ జనసేన అధ్యక్షులు ఊసా రాజేష్, టీడీపీ నాయకులు మైనేని మురళీకృష్ణ, డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, సుంకర రాంబాబు, జనసేన మండల కన్వీనర్ బొందలపాటి చలమయ్య టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచార వాహనం ధ్వంసం ఘటనలో ముగ్గురిపై కేసు

రెంటచింతల, ఏప్రిల్ 10: నరసరావుపేట కూటమి ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలుకు చెందిన డిజిటల్ వాహనాన్ని ధ్వంసం చేసిన కేసుకు సంబంధించి ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ కేవీ నారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంఘటన మండలంలోని మంచికల్లులో మంగళవారం రాత్రి చోటుచేసుకోగా టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాహనం ధ్వంసంచేసిన వారిలో దీకొండ ఆంజనేయులు, దమ్ము అంజిబాబు, అంజిరెడ్డి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిరంకుశ వైసీపీని ఓడించండి

- కూటమి ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులు లావు, జీవీ
- ఎన్నికల ప్రచారంలో అడుగడుగునా ఘన స్వాగతం



ఉప్పలపాడులో టీడీపీలో చేరిన వారితో కూటమి అభ్యర్థులు శ్రీకృష్ణ దేవరాయలు, జీవీ ఆంజనేయులు

నూజెండ్ల, ఏప్రిల్ 10: రానున్న ఎన్నికల్లో నిరంకుశ వైసీపీని ఓడించాలని, ప్రజా కూటమిని గెలిపించాలని నరసరావుపేట ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణ దేవరాయలు, వినుకొండ నియోజవర్గ అసెంబ్లీ అభ్యర్థి జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. నూజెండ్ల మండలంలోని పాత ఉప్పలపాడు, గుర్రపునాయుడుపాలెం, నూజెండ్ల, లక్ష్మీపురం, కొత్తరెడ్డిపాలెం, రవ్వవరం, మేకపాడు, బుర్రిపాలెం, పాతరెడ్డిపాలెం, ముత్తరాసువారిపాలెం, పమిడిపాడు, కంభంపాడు, తెల్లబాడు, పీ అన్నవరం, ఐన వోలు, చింతలచెరువు, మృత్యుంజాపురం గ్రామాల్లో బుధవారం టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కూటమి అభ్యర్థులైన లావు శ్రీకృష్ణదేవరాయలు, జీవీ ఆంజనేయులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన నేతలకు గ్రామ గ్రామాన మహిళలు హారతులు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రజలు నాయకులు చేసిన అభివృద్ధిని గుర్తించి ఆదరిస్తారన్నారు. నూజెండ్ల ప్రాంత అభివృద్ధికి రైతులకు రెండు పంటలు సాగు చేసుకొనేందుకు అవసరమైన గుండ్లకమ్మ నదీ జలాలు సద్వినియోగం చేసుకొనే విధంగా ఎత్తిపోతల పథకాలకు ప్రాధాన్యం ఇచ్చి పూర్తిచేస్తామన్నారు. వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును ఓడించి అహంకారం, నిరంకుశ పోకడలను నివారించాలన్నారు. జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి తప్పా వైసీపీ చేసిన అభివృద్ధి ఏమి లేదన్నారు. బ్రహ్మనాయుడు నియోజకవర్గంలో ఇసుక, బియ్యం, మద్యం తదితర అక్రమాలను ప్రోత్సహించి రియల్‌ఎస్టేట్ వ్యాపారిగా మారారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం ద్వారా ఆరు గ్యారెంటీలతో రాష్ట్రంని అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి పునాది పడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, బీజేపీ నేతలు మేడం రమేష్, ఎండ్లూరి వీరయ్య, జనసేన నేతలు నిశ్శంకరరావు శ్రీనివాసరావు, కొంజేటి నాగశ్రీను రాయల్, మండల పార్టీ అధ్యక్షులు మీసాల మురళీకృష్ణ యాదవ్, టీడీపీ నేతలు ముంద్రు సుబ్బారావు, లగడపాటి వెంకటరావు, బొట్ల అంజయ్య, రొడ్డా వీరాంజనేయరెడ్డి, నక్కా బుల్లీశ్వరరెడ్డి, గంగినేని ఆంజనేయులు, బచ్చు అంజిరెడ్డి, బత్తిన సుబ్బారావు, పవన్‌కుమార్, కొమ్మా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఛత్రియా నాయక్‌ను పరామర్శిస్తున్న బ్రహ్మారెడ్డి

పోలీస్‌స్టేషన్లను శాసిస్తున్న హోంగార్డులు

- ఎస్పీకి సవాల్ విసురుతున్న పిన్నెల్లి సోదరులు
- ఛత్రియానాయక్‌ను పరామర్శించిన జూలకంటి బ్రహ్మారెడ్డి

మాచర్లటౌన్, ఏప్రిల్ 10: మాచర్ల నియోజకవర్గంలో హోంగార్డులు పోలీస్‌స్టేషన్లను శాసిస్తున్నారని, వీరు చెప్పిందే సీఐలు పాటించాల్సిన దుస్థితి నెలకొందని, నియోజకవర్గంలో నిత్యం అలజడులు సృష్టిస్తూ నూతన ఎస్పీకి పిన్నెల్లి సోదరులు సవాల్ విసురుతున్నారని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం సిద్ధం సభకు రాను అన్నాడనే అక్కసుతో మండలంలోని అచ్చమ్మకుంట తండాకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్, వలంటీర్లు దాడి చేసి గాయపరిచిన బాణావత్ ఛత్రియా నాయక్ పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన పరామర్శించారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలికంగా మాచర్ల నియోజకవర్గంలో పోలీస్‌స్టేషన్లలో పని చేస్తూ వైసీపీ తొత్తులుగా వ్యవహరిస్తున్న హోంగార్డులు బాధితులు ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వస్తే ఆ సమాచారాన్ని వైసీపీ నేతలకు చేరవేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరగాలంటే పోలీస్‌స్టేషన్లలో కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. న్యాయం కోసం ప్రజలు పోలీసుల వైపు ఆశగా ఎదురుచూస్తున్నారని, పిన్నెల్లి సోదరులపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. పిన్నెల్లి సోదరులు ముస్లిం నేతలను లక్ష్యంగా పెట్టుకొని గతంలో బక్రీదు పర్వదినం సందర్భంగా అన్వర్ అనే టీడీపీ సీనియర్ కార్యకర్తపై తప్పుడు కేసులు బనాయించి వారి కుటుంబంలో పండుగ లేకుండా చేశారన్నారు. వైసీపీ నేతలు వారిపై వారే దాడి చేసుకొని గాయపడితే టీడీపీకి చెందిన మోసిన్, నాసిర్, ముజఫర్, గౌరె జానిలపై అక్రమ కేసులు బనాయించి రంజాన్ పండుగకు దూరంగా ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. వెల్దుర్తి మండలం కండ్లకుంటలో బీసీలపై, కొత్తపుల్లారెడ్డిగూడెంలో ఎస్టీలపై, మాచర్ల మండలం అచ్చమ్మకుంటతో ఎస్సీలపై, కారంపూడి మండలం కాకానివారిపాలెంలో ఎస్సీలపై, రెంటచింతల మండలం మంచికల్లులో ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు వాహనం ధ్వంసం చేయడం వంటివి చూస్తే శాంతి భద్రతలు ఎలా ఉన్నాయో ఇట్టే అర్థమవుతుందన్నారు. ఆయన వెంట ధారునాయక్, కేశవరెడ్డి, మురళి, గురవారెడ్డి, బాలునాయక్, రెడ్యానాయక్, రాంనాయక్, శ్రీనునాయక్ తదితరులు ఉన్నారు.

జగన్ కుట్రలను ముస్లింలు గమనించాలి

- చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్10: రాష్ట్రంలో ముస్లింల నమ్మకం చంద్రబాబు, టీడీపీ మాత్రమేనని, ఈ విషయాన్ని మరుగున పరచి విభజించి పాలించాలని చూస్తున్న వైసీపీ కుట్రలను గమనించి అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు ముస్లింలకు సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ముస్లింల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా ముస్లింలకు ప్రత్తిపాటి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. దువా చదివి చిలకలూరిపేట శాసనసభ్యునిగా తనను, పార్లమెంట్ అభ్యర్థి అయిన లావు శ్రీకృష్ణ దేవరాయలను గెలిపించేందుకు ఆశీస్సులు అందించాలనికోరారు. నిజానికి ఎన్ఆర్‌సీ, సీఏఏ, త్రిపుల్ తలాక్, కాశ్మీర్‌కు సంబంధించి 370 ఆర్టికల్‌పై లోక్‌సభ, రాజ్యసభల్లో బలపరిచింది వైసీపీనే అని మండిపడ్డారు. టీడీపీ ప్రస్థానంలో ముస్లింలకు ఏనాడూ నష్టం జరగలేదని స్పష్టం చేశారు. ముస్లింలకు ప్రత్యేక బడ్జెట్, ఏటా రంజాన్ తోఫా, హైదరాబాద్‌లో హజ్‌హౌస్‌తో పాటు రూ.25 కోట్లతో కడపలోను హజ్‌హౌస్ నిర్మాణానికి కృషి చేశామన్నారు. మసీదుల్లో ఇమామ్‌లకు రూ.5వేలు, మౌజమ్‌లకు రూ.2వేలు గౌరవవేతనం ఇచ్చింది టీడీపీయేనని, మసీదులు, దర్గాల మరమ్మత్తులకు, శ్మశాన వాటికలకు రూ.50 కోట్ల గ్రాంటు ఇచ్చామని, ముస్లింల నాలుగు శాతం రిజర్వేషన్ కోసం ఆరు కోట్లు ఖర్చు చేసి కాపాడింది చంద్రబాబు అన్నారు. రేపు కూటమి ప్రభుత్వం రాగానే ముస్లింలకు మరింత సంక్షేమం అందించి తీరతామని పుల్లారావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త తోట రాజారమేష్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



ముస్లింల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్తిపాటి పుల్లారావు



సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రైతుసంఘ నేతలు, నిర్వాహకులు

వాస్తవ ఘటనలకు ప్రతిరూపాలు నాటికలు

- రాష్ట్ర రైతుసంఘం నాయకులు కృష్ణయ్య
- నాలుగో రోజు కొనసాగిన నాటకోత్సవాలు

యడ్లపాడు, ఏప్రిల్ 10: నిత్య జీవితంలో జరిగే వాస్తవ ఘటనలకు ప్రతిరూపాలు పరిషత్ నాటికలని రాష్ట్ర రైతుసంఘం నాయకులు కృష్ణయ్య అన్నారు. యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళాపరిషత్, లింగారావుపాలెం కొండవీటి కళాపరిషత్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి నాటకోత్సవాలు నాలుగవ రోజైన బుధవారం రాత్రి కూడా కొనసాగాయి. యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళాప్రాంగణంలోని ఎంవి చౌదరి కళావేదికపై నిర్వహించిన నాటకోత్సవాలకు ముందుగా కమ్యూనిస్టు గాంధీ పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు నాటికలను వీక్షించడం ద్వారా సమాజంలో జరిగే ఎన్నో విషయాలను తెలుసుకోవచ్చన్నారు. అనంతరం వరుసగా మూడు నాటికలు ప్రదర్శించబడ్డాయి. ప్రతి నాటిక అనంతరం లక్కీడిప్ ద్వారా పది మంది ప్రేక్షకులకు నిర్వాహకులు బహుమతులు అందచేశారు. వేదిక, పుచ్చలపల్లి సుందరయ్య కళాపరిషత్ అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు విజయ్‌కుమార్, రాధాకృష్ణ, సుందరయ్య కళాపరిషత్ కమిటీ సభ్యులు ఎన్.కాళిదాసు, జె.శంకరం, ఎం పద్మారావు, కొండవీటి కళాపరిషత్ అధ్యక్షులు కట్టా శ్రీహరి, టి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకులను ఆలోచింపచేసిన నాటికలు

ఆడపిల్లలను బ్రతకనిద్దాం.. బ్రతికించుకుందాం అంటూ సందేశాన్నిచ్చిన నాటిక 'క్షేత్రం' ఆరాధన ఆర్ట్స్ అకాడమీ, గుంటూరు వారు ప్రదర్శించిన ఈ నాటికను ఆకురాతి శిల్ప రచించగా జివి మనహోర్ దర్శకత్వం వహించారు. అనంతరం హెరాయిన్ వంటి మత్తుపదార్థాల నుంచి యువతకు 'విముక్తి' కలిగించి దేశాన్ని రక్షించుకుందాం అంటూ సందేశాన్నిచ్చిన నాటికను ఉషోదయ కళానికేతన్, కట్రపాడువారు ప్రదర్శించారు. ఈ నాటికను చెరుకూరి సాంబశివరావు రచించి దర్శకత్వం వహించారు. రైతన్న మరో కోణంలో ఆలోచించి పంటకు విశ్రాంతినిస్తే ఏం జరుగుతుందో తెలియజేసే కథనమే రైతే రాజు' నాటిక. కంచర్ల సూర్యప్రకాష్ రచనకు కొలా రాధాకృష్ణ దర్శకత్వం వహించిన ఈ నాటికను కళాంజలి, హైదరాబాద్ వారు ప్రదర్శించారు.

జనసేన నేతపై వైసీపీ నాయకుల దాడి

నూజెండ్ల, ఏప్రిల్ 10: జనసేన నాయకులపై వైసీపీ నాయకులు దాడి చేసిన ఘటన మండల కేంద్రం నూజెండ్లలో బుధవారం చోటు చేసుకుంది. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గ్రామంలో ప్రచార కార్యక్రమం నిర్వహించిన సందర్భంలో జనసేన నేత కుమార్ కూడా ప్రచారంలో పాల్గొన్నారు. గ్రామంలో ప్రధాన కూడలి యోగయ్య స్వామి గుడి వద్ద పిడుగురాళ్ళ మేమంతా సిద్ధం సభకు వెళ్ళేందుకు బస్సుల్లో వైసీపీ నాయకులు వేచి ఉన్నారు. అక్కడికి వచ్చిన కుమార్‌పై వైసీపీ నాయకులైన వంగూరి చిరంజీవి దుర్భాష లాడటంతో ఇద్దరి మధ్య వాగ్వాదం మొదలైంది. ఆ సమయంలో చిరంజీవి, వంగూరి ప్రసన్న, ప్రసాదులు తనపై దాడి చేసినట్టు బాధితుడు కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కన్నా

పల్నాడుకు జగన్ చేసిందేమీ లేదు

- సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఏప్రిల్ 10: పల్నాడు జిల్లా ప్రజలను ఓట్లు అడిగే హక్కు వైఎస్ జగన్‌కు లేదని సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల్లో పల్నాడుజిల్లాకు చేసిన అభివృద్ధి ఏమిలేదన్నారు. పల్నాడుజిల్లాలో హత్యలు, మాన భంగాలు, మైనింగ్, ఇసుక, గంజాయి మాఫియా పెరిగిందన్నారు. పల్నాడు జిల్లాలో దొంగనోట్లు కూడా ముద్రిస్తున్నారన్నారు. గోదావరి-పెన్నా నదుల అనుసంధానానికి సంబంధించిన మెటీరియల్ నిరుపయోగమై ప్రజాధనం దుర్వినియోగం అవుతుందన్నారు. మిర్చి పంట ఆరు తడులకు నీరివ్వలేని పరిస్థితుల్లో మంత్రి, సీఎం ఉన్నారన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్-6 పథకాలను, బీసీ డిక్లరేషన్‌ను అమలు చేస్తామన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పటం ఖాయమన్నారు. సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, నాయకులు ఆతుకూరి నాగేశ్వరరావు, జానీ ఖాజావలి, కట్టా శంకరరావు, పూజల వెంకట కోటయ్య, శిరిగిరి శ్రీనివాసరావు, తవిటి భవన్నా రాయణ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ పదవికి, వైసీపీకి

సత్యనారాయణరెడ్డి రాజీనామా

మాచర్లరూరల్, ఏప్రిల్ 10: జిల్లా కోపరేటివ్ మాచర్ల సొసైటీ చైర్మన్, వైసీపీ నేత గుత్తికొండ సత్యనారాయణరెడ్డి బుధవారం తన పదవికి, వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. సొసైటీ చైరన్ పదవి రాజీనామా పత్రాన్ని జిల్లా కోపరేటివ్ అధికారికి పంపారు. మాచర్ల మండలం జమ్మలమడకు చెందిన సత్యనారాయణ వైసీపీలో కీలకంగా వ్యవహరించారు. కాగా ఈయన తన అనుయాయులతో కలిసి టీడీపీలో చేరనున్నట్లు సమాచారం.

ఏపీ ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ సీడ్ డీలర్స్ అసోసియేషన్

రాష్ట్ర అధ్యక్షుడిగా 'వజ్రాల'

గుంటూరు సిటీ, ఏప్రిల్ 10: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా వజ్రాల వెంకట నాగిరెడ్డి రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 14న గుంటూరులోని ఫర్టిలైజర్స్ కల్యాణ మండపంలో జరిగే రాష్ట్ర జనరల్‌బాడీ సమావేశంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అసోసియేషన్ ప్రధానకార్యదర్శిగా ఎన్.అశోకానందరెడ్డి, కోశాధికారిగా కే. విజయకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వైసీపీ అభ్యర్థి ప్రచారంలో వలంటీర్

చుండూరు ఏప్రియల్ 10 : వైసీపీ అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో వలంటీర్ పాల్గొన్న ఘటన బుధవారం నడిగడ్డపాలెం గ్రామంలో జరిగింది. మండలంలోని నడిగడ్డపాలెంకు చెందిన వలంటీర్ షేక్ కరిముల్లా బుధవారం ఉదయం ఆ గ్రామానికి వైసీపీ అభ్యర్థి ప్రచారానికి రాగా కరిముల్లా అతని వెంట ఉండి ఇంటింటికి తీసుకువెళ్ళి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారిని పరిచయం చేసి ఓటు వేయాలని అభ్యర్థించాడు. ఇది గుర్తించిన టీడీపీ నేతలు ఎన్నికల అధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేశారు.

గుంటూరు ఎంపీగా


సీఎం జగన్ పోటీ చేయాలి

- ఇప్పటికే పలువురు అభ్యర్థులను వైసీపీ మార్చారని ఎద్దేవ
- ఆదాయం కోసం మద్యం రేట్లు పెంచిన ఘనుడు జగన్‌రెడ్డి
- తాడికొండ ఎన్నికల ప్రచారంలో పెమ్మసాని చంద్రశేఖర్



దామరపల్లిలో రోడ్ షో నిర్వహిస్తున్న పెమ్మసాని, శ్రావణ్‌కుమార్

తాడికొండ, ఏప్రిల్10: గుంటూరు వైసీపీ ఎంపీగా జగన్మోహన్‌రెడ్డి పోటీ చేసి తనపై గెలవాలని టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సవాల్ విసిరారు. బుధవారం సాయంత్రం తాడికొండ మండలం దామరపల్లి, పొన్నెక ల్లు గ్రామాల్లో గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, తాడి కొండ ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నెకల్లులో ఏర్పాటుచేసిన సభలో పెమ్మసాని మాట్లాడారు. ఇప్పటికే గుంటూరు వైసీపీ ఎంపీ అభ్యర్థులు పలువురిని మార్చారని ఎద్దేవ చేశారు. ఎంపీగా పోటీ చేయటానికి వైసీపీ అభ్యర్థులు దొరకటం లేద న్నారు. జగన్‌కు ధైర్యం ఉంటే తనపై పోటీ చేయాలని సవాల్ చేశారు. రాష్ట్రాభివృద్ధి చేయటంచేతకాక మద్యాన్ని ఆదాయ వనరుగా చేసుకొని మద్యం రేట్లు పెంచి మందుబాబుల జేబులు గుల్ల చేస్తున్నారన్నారు. టీడీపీ హయంలో 160 కంపెనీలు రాష్ట్రానికి వస్తే వాటిని తన్ని తరిమేశారన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశాడన్నారు. ఎన్నికల ముందు రాజధాని ఇక్కడే ఉంటుందని ప్రజలను నమ్మబలికి మోసం చేశారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు లేకుండా చేశా డన్నారు. మట్టి, మైనింగ్, ఇసుక, అక్రమ మద్యంతో రాష్ట్రాన్ని దోచుకున్నా రన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలు వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను గుర్తుంచుకొని రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడే చంద్రబాబునాయుడుని సీఎం చేయాలని కోరుకున్నారు. ముందుగా దామరపల్లి గ్రామంలోని వాటర్‌ట్యాంక్ నుంచి రోడ్ షో నిర్వహించారు. రైతులు ట్రాక్టర్లతో ర్యాలీని చేపట్టారు. అనం తరం పొన్నెకల్లు శివారులో టీడీపీ శ్రేణులు, మహిళలు పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి శ్రావణ్‌కుమార్‌కు ఘనస్వాగతం పలికారు. తీన్మార్ తప్పెట్లతో, పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. అనంతరం పొన్నెకల్లు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రచారం నిర్వహించారు. విద్యార్థినులు ఆయనతో సెల్ఫీలు దిగారు. కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళి అర్పించారు. గ్రామంలోని రోడ్ షో నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. వైసీపీ నుంచి 20 కుటుంబాలు టీడీపీలో చేరారు. పెమ్మసాని చంద్రశేఖర్, శ్రావణ్‌కుమార్‌లు వారికి పసుపుకండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో డాక్టర్ నిమ్మల శేషయ్య, తలశిల ప్రసన్నకుమార్, గుంటుపల్లి మధుసూదనరావు, కంచర్ల శివరామ య్య, చిగురుపాటి అనూప్, తాటి తులసీరామ్, గడ్డిపాటి సాంబశివ రావు, జనసేన నాయకులు విజయ్‌శేఖర్, గులకవరపు నరేష్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పొన్నెకల్లులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న పెమ్మసాని, శ్రావణ్‌కుమార్

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.90
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	154, 163,174
చికెన్ విత్ స్కిన్	294.00
చికెన్ స్కిన్ లెస్	304.00

అమరావతితోనే రాష్ట్రాభివృద్ధి

- మూడు ముక్కలాటతో ప్రజా ప్రయోజనాలకు తిలోదకాలు
- 1576వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, ఏప్రిల్ 10: అమరావతి రాజధాని అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని 33 వేల ఎకరాలు రాజధాని నిర్మాణానికి భూమినిచ్చిన రైతులు స్పష్టం చేశారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న నిరసన దీక్షలు, ఆందోళనలు బుధవారం నాటికి 1576వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మూడు ముక్కలాటతో వైసీపీ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలకు తిలోదకాలిచ్చిందన్నారు. సీఎం జగన్‌రెడ్డి అమరావతిపై చేస్తున్న కుట్రలు మానుకోవాలన్నారు. దమ్ముంటే ప్రత్యేకహోదా తీసుకురావడం చేతకాని సీఎం జగన్‌రెడ్డి అమరావతిపై అబాండాలు వేయటం తగదన్నారు. ప్రాంతాలు, కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అమరావతి అభివృద్ధి చేయాలని, మూడు రాజధానులు బిల్లు పెట్టకూడదని జగన్ సర్కార్‌కు సూచించినా లెక్కచేయనందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. జై ఆంధ్రప్రదేశ్, బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.



తుళ్లూరులో నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

1,09,547 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,04,430 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,09,547 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 85,482 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	18500
నెంబరు. 5	9000	13500
273	9000	12000
341	8000	16000
4884	9500	13000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	19500
బ్యాడిగి	9000	16000
దేవనూరు డీలక్స్	8000	16500
తెల్లకాయలు	5000	11500

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



ప్రచారం నిర్వహిస్తున్న జూలకంటి బ్రహ్మారెడ్డి, పక్కన టీడీపీ నేతలు

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా

● మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి

కారంపూడి, ఏప్రిల్ 10: ఆర్యవైశ్యులకు అన్ని విధాల అండగా ఉంటానని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కారంపూడిలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముదుగా పట్టణంలోని అంకాళమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి సూపర్ 6 పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదించి సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కూటమి అధికారంలోకి రాగానే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు పంగులూరి అంజయ్య, అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, కర్నా సైదారావు, తోట నరసింహారావు, బీసీ సెల్ కన్వీనర్ గోరంట్ల నాగేశ్వరరావు, తెలుగు యువత అధ్యక్షుడు తుపాకుల చిన రత్తయ్య, మాజీ ఎంపీపీలు పాల్గొన్నారు.

ముస్లింల నమ్మకాన్ని వమ్ము చేయను..

రెంటచింతల : ముస్లింలకు ఎప్పుడూ అండగా ఉంటానని, తనపై వారి నమ్మకాన్ని ఎప్పుడూ వమ్ముచేయనని బ్రహ్మారెడ్డి హామీనిచ్చారు. మంగళవారం అర్ధరాత్రి తుమ్మకోటలో పర్యటించి మసీదులో నిర్వహించిన దువాలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఔరంగజేబు(1667) కాలంలో నిర్మితమైన అలంఘీర్ మసీదును పురాతన చారిత్రక కట్టడంగా ప్రకటించడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం స్వయంగా ఇఫ్తార్ వడ్డించారు. కార్యక్రమంలో జాన్ మీరా, నబిషా,పఠాన్ ఖాన్(ఆటో) షేక్ అల్లాభక్షు, బుజ్జి, బండ భాష, నన్నేవలి, లింగా పున్నారావు, మాధవరావు, నరశింహారావు, ఎస్.వెంకట రామారావు, సతీష్, యోహాన్, శివారెడ్డి, గౌతమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరాచకాలు, విధ్వంసాలు ఎంత కాలం ?

అరాకాలు విధ్వంసాలు ఎంత కాలంచేస్తారు.. అభివృద్ధి చేయటం చేతగాని వారే ఇలాంటి చర్యలకు పాల్పడతారని మంచికల్లులో టీడీపీ ప్రచార వాహనంపై వైసీపీ దాడి ఘటనను ఉటంకిస్తూ బ్రహ్మారెడ్డి వ్యాఖ్యానించారు. తుమ్మకోటలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ దాడులు, దౌర్జన్యాలు ఇక సాగవని, తన చివరి రక్తపు బొట్టువరకు పార్టీ కార్యకర్తలను, నేతలను కాపాడుకుంటానన్నారు.

మాచర్లటౌన్ : పల్లెల్లో ప్రశాంతత నెలకొనాలంటే కూటమి గెలుపుతోనే సాధ్యమని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మండలంలోని జమ్మలమడకలో బుధవారంరాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గంను అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. గ్రామానికి చేరుకున్న బ్రహ్మారెడ్డికి కూటమి నేతలు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సొసైటీ చైర్మన్, వైసీపీ నేత గుత్తికొండ సత్యనారాయణరెడ్డి టీడీపీలో చేరారు.

మహిళల జీవితాల్లో వెలుగులు.. మహిళల జీవితాల్లో వెలుగులు నిండాలంటే కూటమి అధికారంలోకి రావాలని కూటమి మాచర్ల నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి సతీమణి శోభారాణి అన్నారు. బుధవారం పట్టణంలోని 2, 15 వార్డుల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కూటమి అధికారంలోకి రాగానే అమలు చేయనున్న సూపర్ 6 పథకాలను వివరించారు. ఆమె వెంట టీడీపీ పట్టణ నేతలు ఉన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం

దాచేపల్లి, ఏప్రిల్ 10: దాచేపల్లి నగర పంచాయతీలో చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో పాటు, నియోజకవర్గంలో యరపతినేని ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ఆర్యవైశ్యులకు తెలియజేసేందుకు మండల ఆర్యవైశ్య సంఘ నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా వాసవి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాశెట్టి బుజ్జి, దేవరశెట్టి రమేష్, సుబ్బారావు, వల్లంబొట్ల అమర్, ముప్వల వెంకట్, దేవరశెట్టి రోజా నాగేశ్వరరావు, ఆతుకూరి బుచ్చేశ్వరరావు, బాదం నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాను.. ఆశీర్వదించండి

● పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్
● వైసీపీని వీడి టీడీపీలోకి చేరికలు..
● మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం..



తాడువాయి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాష్యం ప్రవీణ్

అచ్చంపేట, ఏప్రిల్ 10: 'మీకు అండగా ఉంటాను.. నన్ను ఆశీర్వదించండి.. టీడీపీకి ఓటు వేసి గెలిపించండి..' అంటూ టీడీపీ పెదకూరపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ప్రజలను వినమ్రంగా అభ్యర్థించాడు. బుధవారం అచ్చంపేటలోని పేరంటాళమ్మ ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పలు కుటుంబాలవారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా భాష్యం ప్రవీణ్ వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ప్రవీణ్ మాట్లాడుతూ.. ఒక్క అవకాశం అంటూ ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన జగన్ తన చేతకాని పాలనతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని మండిపడ్డాడు. జగన్ లాంటి వ్యక్తికి మరో అవకాశం ఇవ్వకూడదన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. టీడీపీలో చేరినవారంతా నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, నల్లమేకల వెంకటేశ్వర్లు, మొక్కపాటి గిరిబాబు, ఎస్కే కాసుల, సాంబశివుడు, తిరువాయిపాటి ఆంజనేయులు, బత్తుల శ్రీను, చల్లా అనూపకళ, చల్లా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పడమటి బజారుకు చెందిన 40 కుటుంబాలవారు సుమారు 200 మంది టీడీపీ కండువాలు కప్పుకున్నారు. వారిలో ఢీకొండ శ్రీను, వీ. వెంకటేశ్వరరావు, ఏపూరి ఆంజనేయులు, ఢీకొండ పెదకాశయ్య, చిన కాశయ్య, పుల్లారావు, కే.చినరామకోటయ్య, పెదరామకోటయ్య, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు. అలాగే కొండూరు గ్రామ పంచాయతీలోని నిండుజర్ల గ్రామానికి చెందిన తోకల నీలయ్య, ఆయన కుటుంబ సభ్యులు 10 మంది టీడీపీలో చేరారు.

52వ బూత్‌లో.. అచ్చంపేటలోని 52వ బూత్‌కు చెందిన 23 కుటుంబాలు టీడీపీ చేరాయి. ఎస్కే మౌలాలి, మస్తాన్, బాజీ, బాషా, కే.కొండ, ఖాశిం, బాజీవలి, వేల్పూరుకు చెందిన ఢీకొండ లక్ష్మీనారాయణ, మంతెన వెంకటేశ్వర్లు ఉన్నారు. అలాగే అచ్చంపేటకు చెందిన బాష మీరా హుస్సేన్, ఎస్కే నాగుల్ మీరా, ఎస్కే మస్తాన్‌వలి, ఖాశిం సైదా పార్టీలో చేరినవారిలో ఉన్నారు. అనంతరం పుట్లగూడెం, తాడువాయి గ్రామాల్లో భాష్యం ప్రవీణ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

క్రోసూరు : మండలంలోని విప్పర్లలో భాష్యం ప్రవీణ్ సమక్షంలో తొమ్మిది కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి ప్రవీణ్ వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్న ఉద్దేశంతో అనేక మంది పార్టీలో చేరుతున్నారని, రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం ఎంతో అవసరమని ప్రజలు భావిస్తున్నారన్నారు. పార్టీలో చేరినవారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. మండలంలోని బాలెమర్రుకు చెందిన వైసీపీ నాయకులు లక్ష్మీనారాయణ కూడా టీడీపీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు నలజాల సదాశివ రావు, టీడీపీ నేతలు బొబ్బా వెంకటేశ్వర్లు, గుడిపాడు బాషా, మన్నెం శ్రీనివాసరావు, అప్పారావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో ప్రవీణ్ సతీమణి లావణ్య ప్రచారం

పెదకూరపాడు: భాష్యం ప్రవీణ్, లావు శ్రీకృష్ణ దేవరాయలను గెలిపించాలని కోరుతూ ప్రవీణ్ సతీమణి లావణ్య బుధవారం పెదకూరపాడులో ఇంటింట ప్రచారం నిర్వహించారు. సూపర్ 6 పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఆమె వెంట నియోజకవర్గ టీడీపీ నేత పఠాన్ నూర్జహాన్, తెలుగు మహిళా నేతలు ఉన్నారు.

రంజాన్ సందర్భంగా బియ్యం పంపిణీ

అమరావతి : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని అమరావతి-విజయవాడ రోడ్డులోని సుభానీకాలనీలో 100 ముస్లిం కుటుంబాలకు భాష్యం ప్రవీణ్ 25 కేజీల బియ్యం టిక్కీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.



అచ్చంపేటలో భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు



పెదకూరపాడు ఎన్నికల ప్రచారంలో భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య

దుర్గిలో టీడీపీ నేతల ప్రచారం

దుర్గి, ఏప్రిల్ 10: ఎన్నికల సమీపిస్తుండడంతో మండలంలో పలు చోట్ల టీడీపీ నేతలు ప్రచారం పెంచారు. కంచరగుంట, దుర్గి, ధర్మవరం, అడిగొప్పుల, ముటుకూరు, ఆత్మకూరు గ్రామాల్లో బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రూపొందించిన సూపర్ 6 పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. మాచర్ల నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే బ్రహ్మారెడ్డికి ఓటు వేసి గెలిపించాలన్నారు. బ్రహ్మారెడ్డి గెలుపుతో అభివృద్ధి సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకలదాసు, కందుల విజయ్, ఏడుకొండలు, మాచర్ల మదార్, మాబాషా, అల్లాబాషా, ఎస్కే వలి, ఈసూబు పాల్గొన్నారు.

కూటమి అధికారంలోకి వస్తేనే అభివృద్ధి

గురజాలటౌన్, ఏప్రిల్ 10: కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని ఉమ్మడి కూటమి నేతలు అన్నారు. కూటమి గురజాల అసెంబ్లీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు బుధవారం రాత్రి పట్టణంలోని పార్వతీపురంతోపాటు మండలంలోని గోగులపాడులో డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సూపర్ 6 పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

వెల్దుర్తి, ఏప్రిల్ 10: మండలంలోని శిరిగిరిపాడుకు చెందిన 15 వైసీపీ ఎస్సీ కుటుంబాలు బుధవారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. మండలంలోని శిరిగిరిపాడులో తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి వీరికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కొమ్ము సామేలు, మరియదాసు, పులిపోగు సుగుణరావు, చంటి, మరియబాబు, ఆడెపు విజయ్, మరియదాసు, చంద్రయ్య, అంజయ్య తదితరులు ఉన్నారు.

ప్రచార వాహనం నష్టం రూ. 3.30 లక్షలు

రెంటచింతల, ఏప్రిల్ 10: కూటమి అభ్యర్థి శ్రీకృష్ణ దేవరాయలుకు డిజిటల్ ప్రచార వాహనం ధ్వంసానికి సంబంధించి రూ. 3.30 లక్షలు నష్టం జరిగినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సుమంత్‌రెడ్డిలు తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ దుండగులు ధ్వంసంచేసిన రెండు యాంప్లిఫైర్లు ఖరీదు రూ.30 వేలు, ఎల్ఈడీ స్క్రీన్ రూ.2.54 లక్షలు, ధ్వంసమైన వాహనానికి సంబంధించి రూ. 40 వేలు దాకా నష్టం జరిగిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

రంజాన్ తోఫా పంపిణీ

సత్తెనపల్లి ఏప్రియల్ 10: నకరికల్లు మండలం కుంకలగుంటలో బుధవారం రాత్రి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీచౌదరి ఆధ్వర్యంలో ముస్లింలకు రంజాన్ తోఫా సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు షేక్ మస్తాన్, షేక్ మహబూబ్ భాషా, సిద్దయ్య, చిన్న, కటాక్షం, జగదీష్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై బ్లేడులతో ప్రత్యర్థుల దాడి

వెల్దుర్తి, ఏప్రిల్ 10: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిపై ప్రత్యర్థులు బ్లేడుతో దాడిచేసిన సంఘటన మండలంలోని గుండ్లపాడు వద్ద బుధవారం జరిగింది. కండ్లకుంటకు చెందిన బడిదెల శ్రీను మాచర్ల నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యంలోని గుండ్లపాడు వద్ద స్పీడు బ్రేకర్ ఉండడంతో వాహనం స్లో చేశాడు. అక్కడే కాపుకాచివున్న గురవయ్య, శివతోపాటు మరికొందరు తనపై బ్లేడులతో దాడి చేసినట్లు శ్రీను తెలిపాడు. నాలుగు రోజులక్రితం శ్రీను వర్గీయులు గన్నెబోయిన పెద్దిరాజుపై గొడ్డలితో దాడి చేశారు. ఈ కారణంతోనే పెద్దిరాజు బంధువులు శ్రీనుపై దాడిచేసి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. శ్రీను మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నాడు.



గుంటూరులో చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

హానికారక చికెన్ వ్యర్థాల పట్టివేత

గుంటూరు సిటీ, ఏప్రిల్ 10: ఆరోగ్యానికి హాని కలిగించే చికెన్ వ్యర్థాలను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం గుంటూరు నగరంలో పట్టుకున్నారు. అమరావతి రోడ్డు లాడ్జి సెంటర్ నుంచి సత్తెనపల్లి మండలం భృగుబండ గ్రామంలోని చేపల చెరువులకు వీటిని తరలిస్తున్నట్లు విజిలెన్స్ సీఐ ఎస్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వాటి వలన పర్యావరణ కాలుష్యంతో పాటు ప్రజారోగ్యానికి నష్టం వాటిల్లుతుందని అన్నారు. ఆటోతోపాటు వ్యర్థాలను స్వాధీనంచేసుకొని జీ.మురళి, పీ.హరిబాబు అనే ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎసీప కే.ఈశ్వరరావు ఆదేశాలతో నిర్వహించిన ఈ దాడుల్లో ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎండీ జమానుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం రిజర్వేషన్‌పై అసత్యప్రచారం తగదు

రాజుపాలెం, ఏప్రిల్10: ముస్లింల రిజర్వేషన్లపై వైసీపీ అసత్య ప్రచారం చేయటం తగదని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని టీడీపీ జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి షేక్ అల్లాబక్షు అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి వైసీపీ నేతల అక్రమాలు కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేయడంతో, దీనిని సహించలేని వైసీపీ బ్యాచ్ పురంధేశ్వరిపై అసత్య ప్రచారం చేస్తుందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ముస్లింల రిజర్వేషన్‌ను తగ్గిస్తారని పురంధేశ్వరి చెప్పినట్లు చెప్పటం దుర్మార్గమన్నారు. సమావేశంలో డాక్టర్ జీలాని, నియోజకవర్గ దివ్యగులా సంఘం అధ్యక్షులు నిమ్మకాయల షేక్ మహబూబ్ సుభాని, షేక్ బాబావలి, మైనారిటీ సెల్ నాయకులు పఠాన్ ఉస్మాన్, షేక్ జానీ, షేక్ సుభాని, షేక్ రహీం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

● సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఏప్రిల్ 10: రానున్న ఎన్నికల్లో విజయమే ధ్యేయంగా టీడీపీ పట్టణ కమిటీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రజావేదికలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటకం రామకృష్ణ అధ్యక్షతన పట్టణ కమిటీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కన్నా మాట్లాడుతూ.. పట్టణంలోని కూటమి నేతలు ఐక్యంగా ప్రతి ఇంటింటికి తిరిగి పార్టీ విజయానికి ప్రచారం చేయాలన్నారు. సూపర్ - 6 పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అలాగే వైసీపీ శ్రేణులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఎండగట్టాలన్నారు. వలంటీర్లందరూ పేదలేనని టీడీపీ అధికారంలోకి రాగానే వారి సంక్షేమం, ఉపాధి గురించి తప్పక ఆలోచన చేస్తామన్నారు. సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, టీడీపీ నేతలు ఆతుకూరి నాగేశ్వరరావు, నూర్‌బాషా జానీబాబు, పోట్ల ఆంజనేయులు, మార్కెట్ రాజు, బుడే, సయ్యద్ మాబూ, సయ్యద్ పెద కరిముల్లా, తురగా మేరీగ్రేస్, మల్లేశ్వరరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

చర్చి ప్రారంభోత్సవంలో పాల్గొన్న కన్నా ..

సత్తెనపల్లి రూరల్ : మండలంలోని నందిగామలో బుధవారం తెలుగు బాపిస్ట్ చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమంలో కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్నా ప్రార్థనల్లో పాల్గొని, ఫాస్టర్లచే ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమలో మండల, గ్రామ టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లో పాల్గొన్న కన్నా

ముప్పాళ్ళ: ముప్పాళ్ళలో టీడీపీ ముస్లిం నేతలు బుధవారం రాత్రి ఇచ్చిన ఇఫ్తార్ కార్యక్రమానికి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ప్రతి ఒక్కరినీ పలకరస్తూ భోజనం వడ్డించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో దళితుల పథకాలన్నీ రద్దు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 10: టీడీపీ హయాంలో దళితులకు ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రద్దు చేసిందని యరపతినేని రమేష్ తెలిపారు. బుధవారం పట్టణ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ఎస్సీసెల్ ముఖ్య నాయకుల సమావేశంలో రమేష్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో దళితులకు కొనసాగిన 27 పథకాలకు పైగా వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిందని, రాజ్యాంగం ప్రకారం మరిన్ని పథకాలు కొనసాగించాల్సిన హక్కు వున్నప్పటికీ వైసీపీ ప్రభుత్వం దళితులంటే చిన్న చూపుతో వున్న పథకాలను కూడా నిలుపుదల చేయడం జరిగిందన్నారు. క్రిస్మస్ కానుక, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, విదేశీవిద్య, మహిళా సాధికారతతో పాటు మరికొన్ని పథకాలను రద్దు చేయడంతో దళితులు వైసీపీని ఇంటికి సాగనంపేందుకు సిద్ధంగా వున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే దళితుల సంక్షేమం తిరిగి కొనసాగుతుందని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పణితి రవి, జిల్లా అధ్యక్షులు సాతులూరి కుమార్‌లు తెలిపారు. సమావేశంలో పిల్లి చెన్నారావు, మందా డేవిడ్, కరుణాకర్, నేలటూరి బాలరాజు, చిలకా చిన్న, లంజేపల్లి కొండలు, జార్జి, ఐతం మాణిక్యరావు, తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి వ్యక్తి మృతి

దాచేపల్లి, ఏప్రిల్ 10: దాచేపల్లిలోని నడికూడి రైల్వేస్టేషన్ వద్ద ఓ వ్యక్తి రైలుకింద పడి మృతి చెందాడు. మృతిచెందిన వ్యక్తి దాచేపల్లికి చెందిన మస్తాన్‌వలిగా గుర్తించారు. మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మస్తాన్‌వలి మృతి ప్రమాదవశాత్తు జరిగిందా, మరో కోణం ఉందా? అన్న విషయమై జీఆర్పీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీతోనే నాయీ బ్రాహ్మణుల సంక్షేమం

● టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్

క్రోసూరు, ఏప్రిల్ 10: నాయీ బ్రాహ్మణులకు అండగా ఉంది, వారి సంక్షేమానికి పాటు పడింది టీడీపీయేనని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ అన్నారు. బుధవారం క్రోసూరులో గతంలో టీడీపీ ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి అమలు చేసిన పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. అంతకముందు నాయీ బ్రాహ్మణులతో కలసి కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం గంగాధర్ మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వంలో జారీ చేసిన జీవో నంబర్ 26ను వైసీపీ ప్రభుత్వం పక్కన పడవేసిందన్నారు. జనాభా దామాషా ప్రకారం కార్పొరేషన్‌లకు నిధుల కేటాయింపు, కార్పొరేట్ సంస్థలకు దీటుగా బార్బర్ సెలూన్‌ల ఏర్పాటుకు నిధుల విడుదల, బార్బర్‌షాపులకు ఉచిత విద్యుత్, దేవాలయాల్లో పని చేసే వాయిద్య కళాకారులు, వృత్తిదారులకు ఉద్యోగ భద్రత మొదలైనవి అమలు చేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనన్నారు. టీడీపీ ప్రభుత్వంలో తలనీలాల వేలం పాటలో నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పించారని, జిల్లా కేంద్రాల్లో బ్యూటీషియన్ కోర్సులు, సంగీత కళాశాలల ఏర్పాటు, సాంప్రదాయ వాయిద్య కళాకారుల నియామకం మొదలైనవి అమలు చేశారన్నారు. నియోజక వర్గంలో భాష్యం ప్రవీణ్‌ను, ఎంపీగా శ్రీకృష్ణదేవరాయలను గెలిపించుకోవాల్సిన బాధ్యత నాయీ బ్రాహ్మణులపై ఉందన్నారు. కార్యక్రమంలో సంఘనేతలు చంద్రగిరి ఆదిబాబు, శివుడు, లక్ష్మయ్య, వేణు, వెంకయ్య, రామయ్య శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీసీ రక్షణ చట్టాన్ని సద్వినియోగం చేసుకుందాం

● జడ్పీటీసీ వెంకట కోటయ్య, యరపతినేని నిఖిల్

మాచవరం, ఏప్రిల్ 10: రానున్న సాధారణ ఎన్నికలలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీ రక్షణచట్టానికి చట్టబద్ధత వస్తుందని, దానిని బీసీలందరూ సద్వినియోగపరచుకోవాలంటే గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావుకు సైకిల్ గుర్తుపై ఓటువేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని పిడుగురాళ్ల జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, యరపతినేని నిఖిల్‌లు కోరారు. బుధవారం మండలంలోని వేమవరం గ్రామంలో మాజీ ఎంపీటీసీ కొక్కెర వీరయ్య అధ్యక్షతన బీసీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జంగా వెంకట కోటయ్య, యరపతినేని నిఖిల్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు బీసీలకు మేనిఫెస్టోలో అనేక రకాల పథకాలు ప్రవేశపెట్టారని, బీసీ రక్షణచట్టం, 50 సంవత్సరాలకే పింఛన్ పథకం, ఆదరణ పథకం లాంటి పథకాలు తిరిగి తీసుకురానున్నారని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో బీసీలకు పదవులైతే ఇచ్చారు కానీ గౌరవం ఇవ్వకుండా ఉత్సవ విగ్రహాలుగా మాత్రమే వారిని నిలిపారన్నారు. బీసీల అన్నికులాలకు చైర్మన్ పదవులు, డైరెక్టర్ పదవులు ఇచ్చి ఓటు బ్యాంక్‌గా ఉపయోగించుకున్నారే తప్ప అధికారాలు మాత్రం అగ్రవర్ణాల చేతుల్లోనే వుంచుకొని బీసీలకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. రానున్న ఎన్నికలలో బీసీలంతా ఐక్యంగావుండి సైకిల్‌గుర్తుపై ఓటు వేసి యరపతినేని శ్రీనివాసరావును, లావు శ్రీకృష్ణదేవరాయలును అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిన అవసరం వుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బడిగుంచల వెంకటేశ్వర్లు, జనసేన మండల అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, యారాని వెంకటరావు, గోళ్ల గంగాధర్, ముప్పన వెంకటేశ్వర్లు, నలబోతుల శ్రీనివాసరావు, తురకా వీరస్వామి, కొలగాని శివ, ఆనందరావు, సైదావలి, పుల్లయ్య, సైదయ్య, శ్రీనివాసరావు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో జంగా వెంకట కోటయ్య, యరపతినేని నిఖిల్ తదితరులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



కొరియర్‌లో పూలు పంపుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి ప్రసాద్, అసోసియేషన్ నాయకులు

హామీలు విస్మరించిన జగన్

● సీపీఐ జిల్లా కార్యదర్శి మారతిప్రసాద్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 10: అగ్రిగోల్డ్ యాజమాన్యం గురించి, కోర్టు సంగతి నేను చూసుకుంటానని జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు విస్మరించారని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ మారుతి ప్రసాద్ విమర్శించారు. బుధవారం అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నరసరావుపేట కమిటీ ఆధ్వర్యంలో నరసరావుపేట సీపీఐ కార్యాలయంలో బాధితుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏ మారుతి ప్రసాద్ మాట్లాడుతూ 2017 మార్చి 23న అగ్రిగోల్డ్ బాధితుల దీక్షా శిబిరానికి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వారం రోజులలో రూ.1183 కోట్లు ఇస్తానని, మిగిలిన వారికి ఆరు నెలలో వడ్డీతో సహా ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. మరణించిన బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 లక్షలు పువ్వులలో పెట్టి వారికి ఇంటికి పంపిస్తానని చెప్పారని గుర్తు చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి మరలా అధికారంలోకి రావాలంటే వెంటనే రూ.10 లక్షలు మరణించిన బాధిత కుటుంబసభ్యులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు మీకు పూలు దొరకలేదని మేము మీకుపూలు పంపిస్తున్నామన్నారు. అగ్నిగోల్డ్ బాధితులకు న్యాయం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా 40లక్షల అగ్రిగోల్డ్ బాధితుల ఓట్లు నష్టపోతారని హెచ్చరించారు. సమావేశానికి హనుమంతరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకుడు కేతినేని అగస్టీన్, కాసా రాంబాబు, షేక్ కరిముల్లా, అంజనాదేవి, బూదాల శ్రీను, ఉప్పలపాటి రంగయ్య, షేక్ చిన జాన్‌సైదా, దొడ్డ అంజిరెడ్డి, చిరుగురి జక్రం, రత్నమాల, శ్రీలక్ష్మి, ఎస్‌కేవై మస్తాన్‌వలి, వైవీ నాగేశ్వరరావు, ఎస్‌కే ముంతాజ్ బేగమ్, బీ గోపీనాయక్, కొండా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కళా వైభవం

చిలకలూరిపేట, ఏప్రిల్ 10: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం కళావైభవం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగంగా కూచిపూడి నాట్యాలను మనోరంజకంగా ప్రదర్శించారు. వెంకటేశ్వరస్వామి దేవస్థానం, ఆవోప, ఆర్యవైశ్య విద్యా నిధిల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పొట్టి శ్రీరాములు, ఆలపాటి వెంకటరావు, కృష్ణుడు, కే సతీష్, కే ప్రతాప్ కుమార్, ఆలయ అర్చకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా తెలుగుదేశం పార్టీ

● ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు



ఎడ్వర్డుపేటలో మాట్లాడుతున్న లావు శ్రీ కృష్ణ దేవరాయలు, మతుకుపల్లిలో పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ లావు, మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన

రొంపిచర్ల, ఏప్రిల్ 10: అన్నివర్గాలకు అండగా తెలుగుదేశం పార్టీ నిలుస్తుందని ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు పేర్కొన్నారు. మండలంలోని ఎడ్వర్డుపేట గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి అసెంబ్లీ అభ్యర్థి అరవిందబాబు, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ సయ్యద్ జిలానీలతో కలసి మంగళవారం రాత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్-6 పథకాల ద్వారా అన్నివర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. సాగర్ కుడి కాలువకు నీటిని తెచ్చుకుంటేనే పల్నాడు రైతాంగానికి మంచి రోజులు వస్తాయన్నారు. రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు మేలు జరగాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని కోరారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సాగర్ కుడి కాలువకు గోదావరి వరద జలాలను ఇచ్చే ప్రాజెక్టు పూర్తవ్వాలని, అది టీడీపీతోనే సాధ్యం అన్నారు. 27రకాల పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఎడ్వర్డుపేట నుంచి ఏపీ మోడల్ పాఠశాలకు వెళ్ళే రోడ్డును అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. ఎంపీ నిధులతో గ్రామ రూపురేఖలు మారుస్తామని తెలిపారు. అరవిందబాబు మాట్లాడుతూ నరసరావుపేట నియోజకవర్గంలో అవినీతికి అంతులేకుండా పోయిందని తెలిపారు. మార్పు రావాలంటే తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు, వేల్పుల సింహాద్రి యాదవ్, కపలవాయి విజయకుమార్, అట్ల చినవెంకటరెడ్డి, కె.కోటిరెడ్డి, పులుకూరి జగ్గయ్య, గాడిపర్తి సురేష్, కొలికొండ కొండలు తదితరులు పాల్గొన్నారు.

భారీగా టీడీపీలో చేరిక

నూజెండ్ల, ఏప్రిల్ 10: వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైసీపీకు ఓటు వేస్తే రాష్ట్ర భవిష్యత్తు నాశనం చేసినట్లేనని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు తెలిపారు. రాష్ట్రంలో మళ్ళీ అభివృద్ధి పట్టాలు ఎక్కాలన్నా, గ్రామాలు తిరిగి కోలుకోవాలన్నా చంద్రబాబే సరైన వ్యక్తి అని, ఆయన ముఖ్యమంత్రి ఐతేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి వీడ్కోలు పలికి టీడీపీలో చేరుతుండటం అరాచక పాలనకు నిదర్శనమన్నారు. తాజాగా బొల్లాపల్లి, శావల్యాపురం, నూజెండ్ల మండలాల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరారు. మేళ్ళవాగు నుంచి 30 కుటుంబాలు, రేమిడిచర్ల నుంచి 20కుటుంబాలు, హనుమాపురం నుంచి 10కుటుంబాలు, జయంతి రామాపురం నుంచి మాజీ సర్పంచ్‌తో సహా 10కుటుంబాలు, పమిడిపాడు నుంచి 10కుటుంబాలు బుధవారం నూజెండ్ల మండలంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో పార్టీ కండువాలు కప్పించుకొని అభ్యర్థులకు మద్దతు ఇచ్చారు.

మతుకుమల్లిలో 10 కుటుంబాలు

మతుకుమల్లి (శావల్యాపురం), ఏప్రిల్ 10: మండలంలోని మతుకుమల్లిలో వైసీపీకి చెందిన 10కుటుంబాలు లావు శ్రీకృష్ణదేవరాయలు, జీవీ ఆంజనేయు లు, మక్కెన మల్లికార్జునరావుల సమక్షంలో బుధవారం టీడీపీలోకి చేరాయి. నూజెండ్లలో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలను మతుకుమల్లిలో ఎంపీటీసీ ముండ్రు శేషమ్మ భర్త దానమల్లేశ్వరరావు, ఏటుకూరి లింగమల్లేశ్వరరావు, ఆయన సోదరులు టీడీపీలో చేరారు. నూతనంగా పార్టీలోకి చేరినవారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు యరమాసు కోటేశ్వరరావు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి చింతా గంగయ్య, గ్రామ అధ్యక్షుడు మల్నీడి శ్రీనివాసరావు, ఆలూరి చంద్రబాబు, పాపసాని వెంకట్రావు, చావా నాగమల్లేశ్వరరావు, యలగాల సాంబయ్య, ముండ్రు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

హింసరాజులా సీఎం జగన్

● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ, ఏప్రిల్ 10: ఎన్నికల ప్రచారంలో ప్రజాసౌకర్యాలు, ప్రజారవా ణను విచ్చలవిడిగా వాడుకుంటున్న జగన్‌రెడ్డి దెబ్బకు ప్రజలు పడుతున్న ఇబ్బందులే అందుకు ఉదాహరణ అని జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని తిమ్మాయిపాలెం గ్రామాల్లో మక్కెన మల్లికార్జునరావుతో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా అధికార వైసీపీ పార్టీనుంచీ సుమారు 30 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఇంటింటికి తిరిగి తెలుగుదేశం పథకాలను ప్రజలకు వివరించారు. ఆంజనేయులు మాట్లడుతూ సీఎం సిద్ధం సభలకు ఆర్టీసీ బస్సులు తలించడంతో బస్సులు లేక ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులకు గురౌతున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా గడిచిన ఐదేళ్లలో ప్రజాసమస్యల పరిస్కారానికి ఎన్ని నిధులు తెచ్చారో, తాను ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో ఎన్ని నిధులు తెచ్చానో చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎంపీగా శ్రీకృష్ణదేవరాయలును, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి న్యాయవాదుల చేరికలు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 10: పట్టణానికి చెందిన పలువురు ప్రభావ శీలురైన న్యాయవాదులు వైసీపీ నుంచి టీడీపీలోకి వలస వెళ్తన్నారు. బుధవారం పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది మోరా ప్రతాప్‌రెడ్డి, తన సహచర న్యాయవాదులు పొన్నపాటి ఉమాదేవి, సౌజన్య, గుండాల రవీంద్ర, చిట్టిమాల సురేష్, గంగిరెడ్డి భార్గవరెడ్డి తదితరులు సుమారు వందమంది డాక్టర్ చదలవాడ అరవిందబాబు సమక్షంలో మోరా ప్రతాపరెడ్డి నేతృత్వంలో టీడీపీలో చేరారు. వారికి అరవిందబాబు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. భవిష్యత్‌లో మోరా ప్రతాపరెడ్డి, అతని అనుచరులకు సముచిత స్థానం కల్పిస్తామని డాక్టర్ చదలవాడ హామి ఇచ్చారు. ఈ సందర్భంగా న్యాయవాది మోరా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే వ్యవహార శైలితో విసిగి వేసారి టీడీపీలో పథకాలు, కార్యక్రమాలు నచ్చి టీడీపీలో చేరుతున్నట్టు తెలిపారు. త్వరలో అధికార పక్షానికి చెందిన 16మంది మాజీ కౌన్సిలర్లు తన నేతృత్వంలో టీడీపీలో చేరనున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, న్యాయవాద సంఘ అధ్యక్షుడు మేదరమెట్ల నాగేశ్వరరావు, కపలవాయి విజయ కుమార్, అట్లూరి చిన వెంకటరెడ్డి, పులిమి రామిరెడ్డి, దేశిరెడ్డి చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎండిన తాగునీటి చెరువులు



● పాలకులకు ముందు చూపులేక ప్రజలకు వెతలు
● పట్టించుకోని అధికారులు
● భూగర్భ జలాలు లేక ఆర్వోప్లాంట్ల మూత

వినుకొండ టౌన్, ఏప్రిల్ 10: నియోజకవర్గంలోని తాగునీటి చెరువులు ఎండిపోయాయి. నీటితో కళకళలాడాల్సిన చెరువులు వేడిమి తాకిడికి నేల పొరలకు బీటలు బారాయి. భూగర్భ జలాలు పాతాళానికి చేరాయి, వేసవి వేడిమి తాకిడికి గ్రామాలు దాహం కేకలు వేస్తున్నాయి. బోరునీరు పైకి రాక, చెరువునీరు ఇంటికి చేరక పోవడంతో నీటి కరువును ప్రజలు ఎదుర్కోవల్సి వస్తోంది. వినుకొండ నియోజకవర్గంలో వినుకొండ, నూజండ్ల, శావల్యాపురంలోని తాగునీటి చెరువులకు సాగర్ జలాలే ఆధారం, వినుకొండ మండలంలో నరగాయపాలెం, విఠంరాజుపల్లి, కొటప్పనగర్, నాగులవరం, ఈపూరు మండలంలో బొగ్గరం, కొండ్రముట్ల, నూజండ్ల మండలంలో కె.త్రిపురాపురం, చెరుకుంపాలెం, రవ్వారం, ముత్యుంజయపురం ములకలూరు తదితర చెరువుల్లోని నీటిపై ఆధారపడి ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ఇదిలాఉండగా నరగాయపాలెం చెరువుపై బ్రహ్మణపల్లి, నాగిరెడ్డిపల్లి, బొగ్గరం చెరువుపై చిన్నకొండాయపాలెం, గుండేపల్లి. ముత్యుంజయపురం చెరువుపైనాగిరెడ్డిపల్లి, లింగముక్కపల్లి. కేతిపురాపురం పై, పి.తిపురాపురం. పి.చెరుకుంపాలెం చెరువుపై జడ్డవారిపాలెం, కొత్తచెరుకంపాలెం, కొత్తజడ్డవారిపాలెం గ్రామాలకు నీరు అందించాల్సి ఉంది.



నరగాయపాలెం చెరువులో నీరు అడుగంటి జమ్ముతో అడవిని తలపిస్తున్న చెరువు

మూసుకుపోయిన నీటి మార్గం.....

ప్రధానంగా చెరువులకు నీరు చేరాలంటే కాలవ నీరు పారాలి. కాలవ నీటితో గుండ్లకమ్మ నదీమార్గం ద్వారా చెరువులకు నీరు చేరాల్సి ఉంది. కానీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇసుకకు మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో ప్రధాన వనరులుగా మారిన గుండ్లకమ్మను సమారు 40 కి.మీటర్లు పొడవున ఇసుకను ఊడ్చిపారేశారు. నదీ జలాలు ముందుకు కదలని పరిస్థితి. చెరువులకు సుమారు 13టీఎంసీలు నీరు అవసరమని అధికారులు గుర్తించినా, ఆలకించే నాధుడు కరువయ్యారు. అరకొరగా విడుదలైన నీరు చెరువులకు చేరని పరిస్థితి.

అక్రమాలకు అడా గుండ్లకమ్మ

వర్షాభావ పరిస్థితులతో సాగునీరు కరువై రైతులు వేసిన పంటలు దక్కించుకొనేందుకు గుండ్లకమ్మ నదిపై అక్రమ ంగా గోతులు తీయటంతో నదీ పరివాహక ప్రాంతం గుంతలమయంగా మారింది. అరకొరగా తాగునీటికి ఐదు ఆరు రోజులు విడుదలైన సాగర్ నీరు ముందుకు సాగని పరిస్థితి. దీంతో చెరువలకు నీరుచేరక వినుకొండ, నూజండ్ల మండలాల్లోని ప్రధాన గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తింది. పాలకుటు పట్టనట్లు వ్యవహరించడంతో నీటికి ప్రజలు కటకటలాడుతున్నారు.

చేపల చెరువులపై శ్రద్ధ

నియోజకవర్గంలో మొత్తం 51 చెరువులు ఉన్నాయి. వాటిలో కొన్ని తాగునీటి చెరువులు 13 ఉన్నాయి. గ్రామ పంచాయితీ పరిధిలో ఎస్.ఎ్ ఎ.డీ (సమ్మస్టోరేజి ట్యాంకులు) నడుపుకోవాల్సి ఉంగా, అధికారుల ఆధ్వర్యంలో డీ.డబ్ల్యూ.ఎస్ (డ్రింకింగ్ వాటర్ ట్యాంకులు) ట్యాంకు నీటిపై సుమారు 50గ్రామాలు ఆధారపడి ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేటి పాలకులు చెరువు ఆదాయ వనరులుగా గ్రామ సర్పంచులకు బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వం నుంచి గడిచిన ఐదేళ్ళలో గ్రామాల అభివృద్ధి చిల్లి గవ్వకూడ అందించిన దాఖలాలు లేవు. గ్రామాల అభివృద్ధి కుంటుపడి, చెరువులను చేపల చెరువులుగా మార్చారు. తాగునీరు చెరువులకు చేరాల్సిన సాగర్ నీటిని పాలకులు పలుకుబడితో చేపట చెరువలకు నీటిని మరలించటంతో నీటికి కట, కట ఏర్పడింది.

మౌనంవీడని అధికారులు..

ప్రధాన కాలవలకు గండ్లు పొడిచి నీటి తరలించిన అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. సర్పంచులు చెప్పిందే వేదం కావడం, కాసులకు కక్కుర్తి పడడంతో అధికారులు చెరువులకు నీరు అందించడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల దాహార్తిని దృష్టిలో ఉంచుకుని చెరువులకు నీరు చేరేవిదంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గుండెపోటుతో విద్యార్థి మృతి

నాదెండ్ల, ఏప్రిల్ 10: మండలంలోని సాతులూరులో మంగళవారం రాత్రి తిరునాళ్ళలో విద్యార్థి మేకపోతుల దిలీప్ కుమార్(14) గుండెపోటుతో మృతిచెందాడు. గుంటూరుకు చెందిన రమణమ్మ ఐదేళ్లుగా గ్రామంలో ఉంటూ కూలీపని చేసుకుంటోంది. తల్లిదండ్రులు లేకపోవటంతో మనువడు దిలీప్ కుమార్‌ను స్థానిక జడ్పీ పాఠశాలలో 8వతరగతి చదివిస్తోంది. మంగళవారం జరిగిన రెడ్డిపేరంటాలమ్మ తిరునాళ్ళలో దిలీప్ కుమార్ నెట్‌లో జంపింగ్ ఆడుకొని కిందకు దిగాడు. అనంతరం ఊపిరిఆడర అపస్మారకస్థితికి వెళ్ళిపోయాడు. అతడిని నరసరావు పేటలోని ఒక వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చిలకలూరిపేట, ఏప్రిల్ 10: జాతీయ రహదారి నెంబరు 16పై మార్టూరు, చిలకలూరిపేటల మధ్య బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దాసరి నరేష్ కుమార్(30) అనే యువకుడు దుర్మరణం చెందాడు. తెలంగాణాలోని సాలపల్లి గ్రామానికి చెందిన ఇతడు పట్టణంలోని బ్యాంక్ కాలనీలో ఉంటున్నాడు. మార్టూరు ప్రాంతంలోని గ్రానైట్ ఫ్యాక్టరీలో అసిస్టెంట్ ఇంజనీరుగా, మార్కరుగా పనిచేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై ఇతడు మార్టూరు నుంచి చిలకలూరిపేట వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతడి భార్య అఖిల ఫిర్యాదుమేరకు చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ రవికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నరసరావుపేటలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

● మునిసిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి



15వ వార్డులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నరసరావుపేట రూరల్, ఏప్రియల్ 10: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మునిసిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి తెలిపారు. నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్ర రెడ్డి మార్నింగ్ విజిట్‌లో భాగంగా 15వ వార్డు కొండలరావుపేట, 17వ వార్డు వరవకట్ట పరిసర ప్రాంతాలలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ప్రజలను నేరుగా అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు డ్రైనేజీ సమస్య ఉందని కాలువలలో నీరు పారడం లేదని వెనక్కి వస్తున్నాయని, తాగునీరు కూడా ఎక్కువ వచ్చేలా చూడాలని కోరారు. మునిసిపల్ కమిషనర్ స్పందించి కొత్త కాలువల నిర్మాణానికి కావల్సిన ప్రణాళికలను రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కాలువలలో నీరు పారడానికి చర్యలు చేపట్టాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. స్థానికుల ఆక్రమణలపై టౌన్ ప్లానింగ్ సిబ్బంది కమిషనర్ దృష్టికి తేగా ఆక్రమణలు చేసిన ప్రతి ఒక్కరికి నోటీసు ఇచ్చి, ఆక్రమణలను తొలగించాలని లేకుంటే వారికి ఫైన్ వేయాలని ఆదేశించారు. ఆక్రమణలతో కాలువలు శుభ్రం చేసేందుకు ఆటంకం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహారావు మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ రాజు, ఎస్ఐ రామకోటయ్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



సూపర్ - 6 పథకాలపై ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి

జగన్ పాలనలో పేదల బతుకులు చిన్నాభిన్నం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 10: ఐదు సంవత్సరాల జగన్ పాలనలో అత్యధికంగా నష్టపోయింది పేదలే అని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకు నవరత్నాలు అంటూ పెట్రోల్, డీసిల్, కరెంటు బిల్లుల్లో భారీ వడ్డనలు, పన్నుల మోతతో ఆకాశాన్ని అంటిన నిత్యావసరాల ధరలతో వారి బతుకులు చిన్నాభిన్నమయ్యాయని ఆయన వాపోయారు. పట్టణంలోని 12వ వార్డు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి సూపర్-6 పథకాలతో కలిగే ప్రయోజనాలు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. కుటుంబ సాధికార సారధులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశంలో పేద, మధ్య తరగతి వర్గాలంతా తమ కష్టాలు తీరటానికి తెలుగుదేశం కూటమిని గెలిపించటానికి సిద్ధంగా ఉన్నారని, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో కూడా జగన్ చేసిన అన్యాయం, మోసాలపై తీవ్ర వ్యతిరేకత ఉందని, వారంతా వైసీపీకి తగిన గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు. జగన్ ప్రచారం చేసినట్టు వలంటీరు వ్యవస్థ ఎక్కడికి పోదని ఉగాది సందర్భంగా గ్రామ, వార్డు వలంటీర్ల వేతనాలను రూ.5వేలు నుంచి రూ.10వేలకు పెంచుతామని, వికలాంగుల పింఛను రూ.6వేలు, వృద్ధాప్య పింఛన్ రూ.4వేలుకు పెంచుతామని, నాడు రెండు వందలు ఉన్న పింఛను చంద్రబాబు నాయుడు రూ.2వేలు చేస్తే జగన్ పెంచిన వెయ్యి ఇవ్వటానికి ఐదు సంవత్సరాలు పట్టిందన్నారు. మొత్తంగా చూసుకుంటే జగన్ ఐదేళ్ళల్లో ఇచ్చామని చెపుతున్న సంక్షేమం కంటే పేదలు, మధ్య తరగతి వారిపై మోపిన చార్జీలు, పన్నుల భారమే రెట్టింపని విమర్శించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, బీజేపీ నాయకులు జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సెబ్ జాయింట్ కమిషనర్ అరుణ్‌రావు

ఎక్సైజ్ నేరాల అదుపుపై సమీక్ష

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 10: త్వరలో జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎన్నికల సమయంలో ఎక్సైజ్ నేరాల అదుపునకు తీసుకోవాల్సిన చర్యలు, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌పై బుధవారం పల్నాడు జిల్లా సెబ్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ కమిషనర్ బీ అరుణ్‌రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నమోదు చేసిన కేసుల వివరాలు, తదుపరి తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. అక్రమమద్యం నిల్వలు ఉన్న గోడౌన్‌లు, అక్రమ మద్యం సరఫరా, నాటుసారా తదితర నేరాలపై నిఘా పెట్టి వాటిని గుర్తించి కేసు నమోదు చేయాలన్నారు. తద్వారా మద్యరహిత ఎన్నికలు జరగటానికి తోడ్పడాలన్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి ఎటువంటి మద్యం రవాణా జరగకుండా చూడాలన్నారు. ప్రతిఒక్కరూ అత్యంత జాగ్రత్తగా మెలిగి కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో భాగంగా నేర ఉల్లంఘనలు జరగకుండా చూడాలన్నారు. సమావేశంలో పల్నాడు జిల్లా సూపరింటెండెంట్ ఎస్ ఖాజా మొహిద్దీన్, మంగళగిరి ఏఈఎస్ నరసింహారావు, పల్నాడు జిల్లాలోని సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇన్‌స్పెక్టర్లు, నరసరావుపేట డీటీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇంటిలిజెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ న్యాయవాది పదవికి ఎంఎస్ ప్రసాద్ రాజీనామా

వినుకొండ, ఏప్రిల్ 10: వ్యక్తిగత కారణాలతో ప్రభుత్వ న్యాయవాది పదవికి (ఏజీపీ) రాజీనామ చేస్తున్నట్లు ఎంఎస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన రాజీనామా లేఖను ఈ నెల 3 తేదీన పల్నాడు జిల్లా కలెక్టర్‌కు అందించారన్నారు. తన పదవీ కాలంలో సహకరించిన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

అడవి పేరంటాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

బొందిలిపాలెం (శావల్యాపురం), ఏప్రిల్ 10: ఉగాది పండుగను పురస్కరించుకొని మండలంలోని శానంపూడి శివారు బొందిలిపాలెంలోని అడవి పేరంటాలమ్మ దేవాలయం వద్ద జరిగిన తిరునాళ్ల ఆదాయాన్ని దేవదాయశాఖ అధికారులు బుధవారం లెక్కించారు. తిరునాళ్ల పర్యవేక్షణాధికారి హనుమంతరావు మాట్లాడుతూ తిరునాళ్ళ సందర్భంగా దేవాలయానికి మొత్తం రూ.4,10, 894 ఆదాయం చేకూరిందని తెలిపారు. కొబ్బరికాయల వేలం ద్వారా రూ. 60,500, కొబ్బరిచిప్పల ద్వారా రూ.16,500, ప్రసాదాల ద్వారా రూ.27,000, చీరల ద్వారా రూ.15,890, విరాళాలు రూ.1,44,398, హుండీ ఆదాయం రూ.1,46,606 వచ్చినట్లు తెలిపారు. తిరునాళ్ళను జయప్రదం చేసిన భక్తులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ సోమేపల్లి వీరాంజనేయులు, ఈవో పుణ్యాల వెంకటరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు గట్టుపల్లి వీరాస్వామి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని హుండీ ఆదాయం రూ.55,367

నాదెండ్ల, ఏప్రిల్ 10: మండలంలోని నాదెండ్ల గ్రామ సమీపంలోని నందికుంట విఘ్నేశ్వరుని దేవాలయ హుండీ ఆదాయాన్ని బుధవారం దేవదాయశాఖ అధికారులు లెక్కించారు. మార్చి 19నుంచి ఉగాదిరోజు వరకు రూ.55,367 ఆదాయం వచ్చినట్టు దేవదాయశాఖ ఈవో తులసీదాసు తెలిపారు. ఉగాది ఒక్క రోజునే రూ.13,683 వచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ లెక్కింపులో ఇన్‌స్పెక్టర్ మంజూష, సిబ్బంది త్రిపురారెడ్డి, పూజారి ఇర్లపాటి వాసు తదితరులు పాల్గొన్నారు.

12 సీసాల అక్రమ మద్యం స్వాధీనం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 10: పట్టణంలోని చిలకలూరిపేట రోడ్డులో బుధవారం సాయంత్రం 12 సీసాల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బి నయనతార తెలిపారు. చిలకలూరిపేట మండలం కావూరుకు చెందిన వేముల సుబ్బారావు చిలకలూరిపేట రోడ్డులోని శ్రీవెంకట వాసవి చారిటబుల్ ట్రస్ట్ వద్ద అక్రమంగా మద్యం కలిగి ఉండటాన్ని సాధారణ తనిఖీల్లో గమనించామన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు.

ఉగాది సందర్భంగా ప్రముఖులకు సత్కారం

చిలకలూరిపేట, ఏప్రిల్ 10: పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఉన్న సాయి నగర్, సాయి బాబా దేవాలయంలో ఆదిత్య బ్రాహ్మణ సేవా సమతి ఆధ్వర్యంలో జరిగిన ఉగాది వేడుకల్లో మంగళవారం రాత్రి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను సత్కరించారు. వీరిలో ధూళిపాళ్ళ శ్రీకాంత్, వీసీహెచ్‌కే ప్రసాదు, యడ్లపాటి లక్ష్మీనారాయణ, జీఎస్‌వీ నాగేశ్వరరావు, కే సుబ్రహ్మణ్య శర్మకు ఉగాది పురస్కారాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సీహెచ్ విజయకుమార్, ఎం.శివకృష్ణ ప్రసాదు, టీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నాగూర్ బాషా

వినుకొండ, ఏప్రిల్ 10: కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ నాగూర్ బాషాను ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ రాష్ట్రప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు దాదా గాంధీ నియామక పత్రం బుధవారం అందజేశారు. తన మీద నమ్మకంతో పదవిని కట్టబెట్టిన జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలా, మల్లికార్జున రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులకు నాగూర్ బాషా కృతజ్ఞతలు తెలిపారు.